తప్పుల సవరణకే రైతు సమగ్ర సర్వేలు

జాయింట్ కలెక్టర్ ధర్మారెడ్డి



ఏదులాబాద్‌లో జరిగిన రైతు సమగ్ర సర్వేలో జాయింట్ కలెక్టర్ ధర్మారెడ్డి

7

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మేడ్చల్

గురువారం 17 ఆగస్టు 2017 | 20

నీటి కష్టాలుండవ్





జిల్లా ప్రజలకు ఇక తాగునీటి కష్టాలుండవ్. మంచినీటి బాధలు లేకుండా రిజర్వాయర్ల ఏర్పాట్లతో శాశ్వత పరిష్కారం చూపుతున్నాం. రూ.628 కోట్లతో అర్బన్ మిషన్ భగీరథ పథకం కింద సురక్షిత నీటిని అందిస్తాం. హైదరాబాద్ చుట్టూ 160 కిలోమీటర్లు, ఔటర్ రింగ్‌రోడ్డు లోపల రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలోని 7 మున్సిపాలిటీలు 12 మండలాల పరిధిలోని 183 గ్రామాలకు మంచినీరు అందిస్తాం. కేశవపురంలో రిజర్వాయర్ నిర్మిస్తున్నాం. గ్రేటర్‌లో లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించనున్నాం. - మంత్రి కేటీఆర్

- సంవత్సరంలో ఇంటింటికీ స్వచ్ఛమైన మంచినీరు
- గ్రేటర్‌లో 1612 కిలో మీటర్లు డిస్ట్రిబ్యూషన్ లైన్లు
- ఒక్కో వ్యక్తికి 135 లీటర్ల తాగునీరు
- గ్రేటర్‌లో సంవత్సరంలో లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- హైదరాబాద్ స్లమ్ సిటీగా వద్దనుకుంటే సహకరించాలి..
- కొంపల్లిలో రూ. 628 కోట్లతో భగీరథ పనులు ప్రారంభించిన మంత్రి కేటీఆర్
- కాంగ్రెస్ వాళ్లవి స్కామ్‌లు.. టీఆర్ఎస్‌వీ స్కీములు : ఎంపీ మల్లారెడ్డి
- డీపీపల్లిలో 1600 డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ
- షాపూర్‌నగర్‌లో రిజర్వాయర్ ప్రారంభం

20 లో



సమస్యలపై సమాలోచనలు

- ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు చర్యలు
- నేటి నుంచి 19 వరకు మండలాల వారీగా సమీక్షలు
- సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు
- ప్రజాప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యంతో నివేదిక రూపకల్పన
- ముఖ్యమంత్రి హామీలపై ప్రతిపాదనలు
- సంక్షేమ పథకాలు అర్హులైన వారికి చేరేలా చర్యలు

7



సమష్టి కృషితోనే సక్సెస్



- 'స్వచ్ఛ' మేడ్చల్‌గా ప్రకటించడం గర్వకారణం
- బహిరంగ మల విసర్జన రహిత జిల్లాల జాబితాలో మేడ్చల్
- దేశంలో జిల్లా 179వ స్థానం, రాష్ట్రంలో మూడో స్థానం
- ప్రతి మరుగుదొడ్డికి జియోట్యాగింగ్
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ ఎం.వి.రెడ్డి

7



రెండు గ్రామాల్లో ఒక్క గణేషుడే తీర్మానం చేసిన లక్ష్మాపూర్, తుర్కపల్లి గ్రామాల ప్రజలు

7

ఐక్యత దిశగా గ్రామాలు

ప్రముఖుల రాక.. ఇబ్బందుల్లో విద్యార్థులు



- గంటల తరబడి ఎండలో నిలబడి అతిథుల కోసం ఎదురుచూపులు
- ఇబ్బందులకు గురౌతున్న ఉపాధ్యాయులు

6

ఆంధ్రజ్యోతి / ఇంటర్వ్యూ

దోమల నివారణకు
టీమిఫాస్ పిచికారి

- దోమ లార్వా నిర్మూలనకు రెండు వేల గంబోజియా చేప పిల్లలు
- పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ తగిన శ్రద్ధ తీసుకోవాలి
- వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి మలేరియా అధికారి గంగప్ప



వికారాబాద్ అర్బన్: దోమల నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా దోమ లార్వాల నిర్మూలన కార్యక్రమం చేపడుతున్నాం. దీన్ని టీమిఫాస్ పిచికారి కార్యక్రమంలో పిలుస్తున్నాము. ముఖ్యంగా క్యూలెక్స్ దోమవల్ల వివిధ రోగాలు వచ్చే అవకాశం ఉంటుంది. అందులో ముఖ్యంగా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడు వాపు, బోధకాల వ్యాధులు వస్తాయి. ఈ మధ్యనే అఫ్రికాలో కన్పించే జీకా అనే వ్యాధి లక్షణాలు ఈ మధ్య కాలంలో అలహాబాద్‌తో పాటు తమిళనాడులోని కృష్ణ జిల్లాలో కనిపించాయి. ఇది దృష్టిలో ఉంచుకుని వైద్య శాఖ ఆధ్వర్యంలో దోమలు పెట్టే గుడ్ల నుంచి లార్వాలను అంతం చేయడం కోసం వివిధ రకాల కార్య క్రమాలను చేపడుతున్నాం. ఇప్పటికే జిల్లాలోని మోమిన్‌పేట, పట్లూర్, పెద్దే ముల్ పీహెచ్‌సీ పరిధిలోని ఏడెనిమిది గ్రామాలకు 1500 గంబోజియా చేప పిల్లలను పంపిణీ చేయడం జరిగింది. ఈ చేప పిల్లలను బావులు, చెరువులు, కుంటలల్లో వేశారు. క్యూలెక్స్ దోమలు ఎక్కువగా డ్రైనేజీల్లో, బావుల్లో, కుంటల్లో ఉంటాయి. క్యూలెక్స్ దోమల వ్యాప్తిని నివారించేందుకు గంబోజియా చేప పిల్లలను వదలడం జరుగుతోంది. గుడ్డుపెట్టిన దోమ లార్వా పీఫా అనే వైరస్ ఉత్పత్తి కావడానికి ఏడెనిమిది రోజులు పడుతుంది. అదే సమయంలో ఆ లార్వా, ఫిపాను నాశనం చేయడం కోసం ఈ చేప పిల్లలను వదులడం జరుగుతుంది. అదే విధంగా మున్సిపల్ పరిధిలోని ప్రధాన డ్రైనే జీల్లో సైతం ఈ గంబోజియా చేపపిల్లలను వదలడం జరుగుతుంది. ఇక్కడ 500 చేప పిల్లలను మురుగు కాల్వల్లో వదులుతున్నాం. ఇప్పటి వరకు పలు ప్రాంతాల్లో వంద చేప పిల్లలను మురుగు కాలువల్లో వదిలాం. ఈ విధానం ద్వారా దోమలు నాశనం కావడంతో పాటు పర్యావరణానికి ఎలాంటి హాని జరుగదు. అదే విధంగా ఎడిస్ దోమ ఎక్కువగా మన ఇళ్లల్లో మూతలు పెట్టకుండా ఉండే నీటిపై ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఈ రకమైన దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వస్తుంది. ఇలాంటి దోమలు వృద్ధి కాకుండా ఉండేందుకు ప్రతి ఇంట్లో బిందెలు, సిమెంట్ తొట్టీలు, బకెట్లపై మూతలు ఏర్పాటుచేసుకోవాలి. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేసేందుకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాం. వార్డుల్లోకి తిరిగి దోమల వచ్చే కలిగే నష్టాలు, అనర్థాలను వివరిస్తూ ప్రజలకు దోమల నివారణకు అనుసరించాల్సిన సూచనలు, సలహాలు అందజేస్తున్నాం. దోమల నివారణ కోసం ఎలాంటి చర్యలు చేపట్టాలో కూడా ప్రజలకు తెలియజేస్తున్నాం. ఉదా హరణకు తొటి నీటిలో టీమిఫాస్ మందును ఒక లీటర్ మంచినీటి బాటి ల్‌లో పోసి ఆ నీటిని తొట్టి నీటిలో కలిపితే ఈ టైగర్ దోమ లార్వా చని పోవడం జరుగుతుంది. ఇప్పటి వరకు జిల్లాలో మలేరియా కేసులు ఎనిమిది నమోదు కాగా ,ఈ కేసుల్లో ఎక్కువగా బొంరాస్‌పేట్, జింగుర్తి ఏరియాల్లో నమోదైనవే. అదే విధంగా డెంగ్యూ కేసులు మన జిల్లాలో మూడు నమో దయ్యాయి. ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో దోమలు లేకుండా చూసు కోవా లి. పరిసరా ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

మురుగునీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. మురుగునీరు ఉన్న ప్రదేశాల్లో దోమలు ఎక్కువగా వృద్ధి చెందుతాయి. దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు తగిన నివారణ చర్యలు తీసుకుంటే చాలావరకు రోగాలకు దూరంగా ఉండవచ్చు.

కానరాని ప్రగతి జాడలు

- అభివృద్ధికి ఆమడ దూరంలో ఆమనగల్లు
- ప్రతి పాదనల్లోనే నిలిచిన అభివృద్ధి
- పరిష్కారానికి చొరవ చూపని నేతలు
- నేతల మధ్య సమన్వయ లోపం- ప్రజలకు శాపం

ఆమనగల్లు: నాలుగు మండలాలకు కూడలిగా ఉండి, రాష్ట్ర రాజధానికి చేరువలో ఉన్న ఆమనగల్లు పట్టణం నేటికి ఆశించిన ప్రగతికి నోచుకోలేదు. ఏళ్ల కాలంగా సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నేతల మధ్య సమన్వయ లోపం, కొందరి స్వార్థం ప్రగతికి శాపంగా మారింది. కల్వకుర్తి నియో జకవర్గానికి కేంద్ర బిందువుగా ఉండి వేగంగా విస్తరిస్తున్న ఆమనగల్లు ప్రగతిలో మాత్రం పూర్తిగా వెనకబడింది. అధికారుల ఉదాసీన వైఖరి, ప్రజాప్రతి నిధుల పట్టింపులేని ధోరణి వెరసి అనేక పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. ఏళ్లుగా ఆయా సమస్యల పరిష్కారానికి, పలు అభివృద్ధి పనులకు స్థానికులు చేస్తున్న విన్నపాలకు మోక్షం లభించడం లేదు. ప్రజాప్రతినిదులు కొందరు తమ సొంత వ్యవహారాలపై చూపుతున్న శ్రద్ధ ప్రజా సమస్యల పరిష్కారంలో చూపడం లేదన్న విమర్శలున్నాయి.

తాగునీటి సమస్య

కాలమేదైన ఆమనగల్లు పట్టణంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. సగానికిపైగా కాలనీలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. కొన్ని



తాగునీటి కోసం మహిళల ఇక్కట్లు (ఫైల్)



రోడ్లపైనే కూరగాయాల విక్రయాలు

కాలనీలలో మహిళలు నెలల కాలంగా దాహార్తీ బాధలతో అల్లాడుతున్నారు. కృష్ణా తాగునీటి కేటాయింపులకు వాటర్ బోర్డు అధి కారులపై ఒత్తిడి తేవడంలోనూ ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. పక్షం రోజులకోసారి మహి ళలు తాగునీటి సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేయడం పరిపాటిగా మారింది.

అసంపూర్తిగా నిర్మాణాలు

ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణం, వ్యవసాయ శాఖ కార్యాలయ అదనపు గది నిర్మాణం, షాదీఖానా నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. నాయకులు, ఉన్నతాధికారులు ఆయా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

డిగ్రీ కళాశాల ఏర్పాటు, ప్రభుత్వ ఆసుపత్రి, బస్టాండ్ విస్తరణ, బీసీ బాలికల వసతి గృహం ఏర్పాటు, ఆదర్శ పాఠశాల, ఆర్అండ్‌బీ అతిథి గృహ నిర్మాణం, మండల పరిషత్ ఎదుట దుకాణ సముదాయ నిర్మాణం, హైదరాబాద్ ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, బస్టాండ్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ఎక్సైజ్ కార్యాలయానికి, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు సొంత భవనాల నిర్మాణం, మిని స్టేడియం ఏర్పాటు, రైతు బజార్ ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు నేతల హామీలకు, అధికారుల ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. ఆమనగల్లు పట్టణంలో ఒక్క పార్కు కూడ లేదు.


రోడ్లపైనే విక్రయాలు

వారాంతపు సంతా, కూరగాయల, చేపల, మాంసం విక్రయాలకు పట్టణంలో నిర్దిష్ట స్థలాలు లేవు. దీంతో గాంధీ చౌక్ నుంచి అంగడీ బజార్ వరకు రోడ్డుకిరువైపులా కూరగాయల విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో ఇటు వ్యాపారులు, అటు కొనుగోలు దారులు ఏళ్ల కాలంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారులు కూడా చాలా చోట్ల ఆక్రమణకు గురయ్యాయి. పట్టణంలో పార్కింగ్ స్థలాలు కూడ లేవు.

లోపించిన పారిశుధ్యం

ఆమనగల్లు పట్టణంలో పారిశుధ్యం పూర్తిగా లోపించింది. మురుగు కాల్వలు కొన్ని చోట్ల శుభ్రత లేక దుర్వాసన వెదజల్లుతున్నాయి. కొత్త కాలనీలలో మురుగు కాల్వలు లేక ఇళ్ల నుంచి వస్తున్న మురుగు నీరు. రోడ్లపైనే నిలుస్తుంది. దీంతో ఈగలు, దోమలు ముసురుతున్నాయి. అంతర్గ రోడ్లు కూడ కొన్ని చోట్ల అధ్వానంగా తయారయ్యాయి.

ఎవరు పట్టించుకోవడం లేదు



ఆమనగల్లు పట్టణ అభివృద్ధి, సమస్యల పరిష్కారం గురించి ఎవరు పట్టించుకోవడం లేదు. అనేక అభివృద్ధి పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. సమస్యలతో ప్రజలు ఏళ్ల కాలంగా ఇబ్బందులు పడుతున్నారు. వేగంగా పట్టణం విస్తరిస్తున్న అందు కనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు ఒనగూడడం లేదు.

-బికుమాండ్ల యాదయ్య, టీడీపీ నాయకుడు

ప్రభుత్వానికి నివేదించాం



ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవన నిర్మాణం గురించి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తున్నాం. స్థలం కేటాయించి భవనం నిర్మించాలని జిల్లా కలెక్టర్‌కు నివేదించాం. సాంఘిక సంక్షే మ గురుకుల పాఠశాల సొంత భవన నిర్మాణానికి మంగళ పల్లి గేట్ సమీపంలో నాలుగు ఎకరాల భూమిని కేటాయించాం.

- తల్లోజు లలితవెంకటయ్య, ఎంపీపీ, ఆమనగల్లు

సమన్వయంతో కృషి చేయాలి



సమస్యల పరిష్కారానికి మండల ప్రజా ప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు సమ న్వయంతో ముందుకు సాగాలి. స్థలాలు కేటాయించి విద్యా సంస్థల, ఇతర అభివృద్ధి పనుల నిర్మాణాలు చేపట్టాలి. కృష్ణా తాగునీటి కేటాయింపులు పెంచి నీటి సమస్యను పరిష్కరించాలి. బస్టాండ్ విస్తరించి మెరుగైన సదుపాయాలు కల్పించాలి.

- పూసల సత్యం, జిల్లా ఉపాధ్యక్షుడు

మహిమాన్వితమైన శ్రీరామభద్ర క్షేత్రం

శామీర్‌పేట రూరల్: భక్తులు కోరిన కోర్కెలు తీర్చుతు, రామ నామంతో మారుమ్రోగుతున్న ఈ రామభద్రక్షేత్రం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం పొతాయపల్లి గ్రామ సమీపంలో వెలిసియున్నది. శ్రీ శంకరా చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరామభద్ర క్షేత్రాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్మించారు. ఈ ఆలయం పూర్తిగా గందపు రాతితో శిలామయంగా 16 స్తంభాలతో అత్యంత సుందరంగా నిర్మించారు. ఈ ఆలయంలోని సుదర్శన చక్రం అత్యంత విశిష్టమైనది. ఈ ఆలయం ద్వీతీయ భద్రాద్రి క్షేత్రంగా ప్రసిద్ధి చెందుతుంది. ఈ ఆలయానికి తూర్పు బాగంలో ఆంజనేయ స్వామి ఆలయాన్ని అయోధ్యలో రామమందిర ప్రేరణతో ఇరవై నాలుగు గంటల్లో నిర్మాణం పూర్తి చేశారు. ఈ ఆలయ నిర్మాణానికి పట్లూరి మాణిక్య సోమయాజులు, ఆయుత చండి యాగ నిర్వాహకులు అష్టకాల రామ్మోహన్‌శర్మ, సంస్కృత సోదరులు శ్రీనాద్‌శర్మ, మహదేవశర్మలు, భక్తులు, గ్రామస్థులు ఆరు నెలల వ్యవధిలోనే ఆలయ నిర్మాణాలను పూర్తి చేశారు. ఈ ఆలయంలోని ఉత్సవ విగ్రహాలు భద్రాచలంలోని శ్రీరామభద్ర క్షేత్రం గర్భగుడిలో పూజలు చేసి ఈ ఆలయానికి తీసుకవచ్చామని ఆలయ ఫౌండర్ సంతోష్‌శర్మ తెలిపారు. ఈ ఆలయాన్ని శ్రీ శృంగేరి భారతీ తీర్దస్వామి దివ్య ఆశీస్సులతో మే 7న 2017లో ప్రతిష్ట కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.



కొలువైన సీతారామచంద్రస్వామి

ఉద్యోగపర్వం

కంట్రిబ్యూటరీ పింఛన్ విధానాన్ని రద్దు చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్



ఘట్‌కేసర్: కంట్రిబ్యూటరీ పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్‌విధానాన్ని పునరుద్ధరించాలి. ఈ విషయమై ఈనెల 9, 10 తేదీలలో మండల స్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపట్టాము. సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎస్ ఉపాధ్యాయ ఉద్యోగులందరు విధులకు సాముహిక సెలవులు పెట్టి నల్లబ్యాడ్జీలతో కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నాం. సర్వీసు రూల్స్‌కు సంబందించి రాష్ట్రపతి స్థాయిలో సవరణ జరిగినందున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నూతన సర్వీసు రూల్స్‌ను తయారు చేసి విద్యావ్యవస్థలో ఖాళీగా ఉన్న ఎంవోఈ, జేఎల్ఎస్ ఇతర ఫోస్టులను ప్రమోషన్లద్వారా పూర్తి చేయాలి.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఘట్‌కేసర్: అత్తింటి వేధింపులకు ఓ వివాహిత అత్మాహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. సీఐ ప్రకాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నోజిగూడ గ్రామానికి చెందిన బి. గణేష్ (26) శామీర్‌పేట మండలం కేశవరం గ్రామానికి చెందిన రాధికకు 8 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. అప్పటి నుంచి రాధికను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న గణేష్ కుటుంబ సభ్యులు వేధింపులు తీవ్రతరం చేయడంలో భాగంగా భార్యకు పిల్లలు పుట్టడం లేదని గణేష్‌కు మరో వివాహం చేస్తామని బెదిరింపులకు పాల్పడటంతో ఈ నెల 13న వెంట్రుకలకు వేసుకునే రంగును నీటిలో కలుపుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో ఆమెను గాంధీ ఆసుపత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఉత్తమ అధికారిగా డీఆర్‌డీవో కౌటిల్య



ప్రశంసాపత్రాన్ని అందుకుటున్న డీఆర్‌డీవో కౌటిల్య

కీసర రూరల్: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించినందుకు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా డీఆర్‌డీవో కౌటిల్యకు హోంమంత్రి నాయిని నర్సింహరెడ్డి, కలెక్టర్ యం.వి.రెడ్డిలు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఉపాధిహామీ పనుల్లో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, మొక్కలు నాటడం, స్వయం సహాయక గ్రూపులు చరుకుగా పనిచేసే విధంగా నిరంతరం పర్యవేక్షించి జిల్లా అభివృద్ధిలో పాల్గొంటున్నందుకు జిల్లా యంత్రాంగం ఉత్తమ జిల్లా అధికారిగా ప్రకటించారు.

డిప్యూటీ సీఎం మహమూద్ అలీకి సన్మానం



మహముద్ అలీని సన్మానిస్తున్న మహ్మద్ ఆజామ్

మేడ్చల్ రూరల్: డిప్యూటీ సీఎం మహముద్ అలీతో పాటు ఎమ్మెల్సీలను మండల టీఆర్ఎస్ నాయకులు, వ్యాపారవేత్త ఘనంగా సన్మానించారు. గురువారం డిప్యూటీ సీఎంతో పాటు పలువురు ఎమ్మెల్సీలు సిద్దిపేట జిల్లా, ములుగు మండలంలోని ఎర్రవల్లిలోని సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్లారు. సాయంత్రం తిరిగి హైదరాబాద్‌కు వెళ్తూ కాసేపు శామీర్‌పేట వద్ద ఆగారు. దాంతో డిప్యూటీ సీఎం మహముద్ అలీ, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఫరీదుద్దీన్, ఎమ్మెల్సీ, రాష్ట్ర వక్ఫు బోర్డు చైర్మన్ మహ్మద్ సలీమ్, ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ డిప్యూటీ మేయర్ బాబాఫసియుద్దీన్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహ్మద్ అక్బురుద్దీన్, ఖాదీ ఇండస్ట్రీస్ చైర్మన్ మహ్మద్ ఖాద్రీ, వక్ఫు బోర్డు చైర్మన్ ముజీబుద్దిన్, రాష్ట్ర సెట్విన్ సంస్థ చైర్మన్ ఐనాఎత్‌భాగ్రిలను శామీర్‌పేటలోని షేక్‌చాంద్ కంపెనీ యజమాని, ప్రముఖ వ్యాపారవేత్త మహ్మద్ ఆజామ్ ఇంటికి గౌరవంగా ఆహ్వానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారిని మహ్మద్ ఆజామ్‌తో పాటు టిఆర్ఎస్ మండల నాయకులు జహంగీర్, మహ్మద్ అర్ఫత్ పూలమాలను వేసి, పుష్పగుచ్ఛాలనిచ్చి, శాలువాలను కప్పి ఘనంగా సన్మానించారు.

రోడ్డు పక్కకు దూసుకెళ్లిన స్కూల్ బస్సు

● తృటిలో తప్పిన ప్రమాదం

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండల పరిధి రాయపోల్ దగ్గర గురువారం ఉదయం శ్రీ చైతన్య టెక్నో స్కూల్ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకుపోయింది. దీంతో తృటిలో ప్రమాదం తప్పింది. బస్సులో 18 మంది విద్యార్థులుండగా వీరంతా సురక్షితంగా ఉన్నారు. రోడ్డు విశాలంగా ఉన్నప్పటికీ రోడ్డు పక్కకు దూసుకుపోయిందంటే డ్రైవర్ అజాగ్రత్తేనని తెలుస్తోంది.

రాష్ట్రస్థాయి అవార్డులు లభించడం గర్వకారణం

● వేడుకలకు హాజరుకాని అధికారులకు మెమోలు

● సమీక్షా సమావేశంలో కలెక్టర్ ఎం.వి.రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వి.రెడ్డి

కీసర రూరల్: జిల్లా ఉద్యోగులకు రాష్ట్ర స్థాయి అవార్డులు పొందడం గర్వంగా ఉందని కలెక్టర్ ఎం.వి.రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకల నిర్వహణకు ఏర్పాటుచేసిన కమిటీలు పక్కా ప్రణాళికతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. అందుకు కమిటీల సభ్యులను అభినందించారు. శానిటేషన్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవడం, ప్రతి ఒక్కరికీ అల్పాహారం, మంచినీటిని అందజేయడం జరిగిందని తెలిపారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన క్రీడా పోటీలను పక్కాగా నిర్వహించినట్టు చెప్పారు. వేడుకల్లో విద్యార్థులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని వారిని అభినందించారు. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లల్లో తెలంగాణ వంటకాలు ప్రజలకు అందుబాటులో ఉంచడం అభినందించ దగ్గ విషయమన్నారు. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన పూలమొక్కలు ఆకర్షణగా ఉన్నాయని, వాటి సంరక్షణకు ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలకు హాజరు కాని అధికారులు, ఉద్యోగులకు వెంటనే మెమోలు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో సురేందర్‌రావు, డీపీవో సురేష్‌మోహన్, డీఆర్‌డీవో కౌటిల్య, డీఈవో ఉషారాణి, డీఎఫ్‌వో కృష్ణ, సీపీవో సౌమ్య, ఆర్డీవో హనుమంత్‌రెడ్డి, ఏసీపీ రఫీక్, అధికారులు పాల్గొన్నారు.

భవనాల నిర్మాణం కోసం స్థల పరిశీలన



రెవిన్యూ రికార్డులను పరిశీలిస్తున్న జేసి ధర్మారెడ్డి

శామీర్‌పేట రూరల్: సీఎం కేసీఆర్ ఇటీవల నిర్వహించిన గ్రామసభలో ఇచ్చిన హమీల మేరకు భవనాలు, ఫంక్షన్‌హల్, నిర్మించుటకుగాను స్థల పరిశీలనలో బాగంగా మండలంలోని మూడుచింతలపల్లి. కేశవరం, లక్ష్మాపూర్ గ్రామాల్లో జాయింట్ కలెక్టర్ ధర్మారెడ్డి బుధవారం పరిశీలించారు. మూడుచింతలపల్లి గ్రామంలోని సర్వే నంబరు 22 లోని 7 నుండి 8 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని మల్లిపర్పస్ హల్, ప్రజావైద్యశాల, డబుల్ బెడ్‌రూమ్ నిర్మాణాల కోసం తహశీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ భర్త లక్ష్మారెడ్డితో కలిసి ఆయన స్థలాలను పరిశీలించారు. అదేవిధంగా కేశవరం గ్రామంలోని సర్వే నంబరు 226 సర్వే నంబర్‌లో గల 28.14 గుంటల ప్రభుత్వ భూమి, స్థానిక రైతులకు సంబంధించిన స్థలాలను గ్రామస్తులతో కలిసి ఫంక్షన్ హల్, డబుల్ బెడ్‌రూమ్, ఉద్యానవనం ఏర్పాటుకు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ ప్రజా అవసరాల నిమిత్తం నిర్మించనున్న భవనాల కోసం ఈ మూడు గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్నామని ఆయన తెలిపా రు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఆర్ఐ సందీప్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మాపూర్ గ్రామంలో

మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న భూసర్వే వివరాలను గ్రామ పంచాయతీలో సమావేశం ఏర్పాటు చేసి సంబంధితశాఖ అధికారులను జేసి ధర్మారెడ్డి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వే నిర్వహణలో భాగంగా రెండు రోజుల నివేధికలను ఆయన పరిశీలించారు. ఎంతమేరకు సర్వే పూర్తయ్యిందని, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అధికారులను అడిగారు. సాధ్యమైనంత త్వరగా సర్వేను పూర్తి చేయాలని జేసి అధికారులను ఆదేశించారు.

'విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలి'

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరం కాంతారావు




కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

కీసర రూరల్: తెలంగాణ విమోచన దినం సెప్టెంబర్ 17ను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు మాధవరం కాంతారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విమోచన దినాన్ని అధికారికంగా జరపాలని కోరుతూ కాంతారావు ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ యం.వి.రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌ను నిజాం నిరంకుశ పాలనలో, మతోన్మాది ఖాసిం రిజ్వీ నేతృత్వంలో రజాకార్లను సృష్టించి ప్రజలపై ఆకృత్యాలకు, దురాగతాలకు పాల్పడరన్నారు. 1947 ఆగస్టు15న దేశానికి స్వాత్రంత్యం వచ్చినప్పటికీ, హైదరాబాద్‌కు తానే రాజునని ప్రకటించుకున్నాడన్నారు. ప్రజలపై ఆకృత్యాలు పెరిగిపోతుండడంతో నాటి కేంద్రహోం మంత్రి వల్లబ్‌భాయ్ పటేల్ చొరవతో చేపట్టిన పోలీస్ చర్య ద్వారా హైదరాబాద్ సంస్థానానికి 1948 సెప్టెంబర్ 17 విముక్తి కలిగిందని తెలిపారు. తెలంగాణ ప్రజల జీవితాలతో ముడిపడిన సెప్టెంబర్ 17ను విమోచన దినోత్సవంగా ప్రభుత్వమే నిర్వహించాలని, ఉద్యమ సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వమే విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని, తెలంగాణ ఉద్యమ ఘట్టాలను, పోరాట క్రమాన్ని పాఠ్యాంశంగా చేర్చి విద్యార్థులకు భోధించాలని బీజేపీ విజ్ఞప్తి చేస్తుందని వెల్లడించారు. తెలంగాణ ప్రజల మనోభావాలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి మాధవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.సత్యనారాయణ, ఆర్.కే.శ్రీనివాస్, మల్లిక, బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు ఎస్.వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి కందాడి సత్తిరెడ్డి, సీ.ఆర్.నటరాజ్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు ఆనంద్, రామకృష్ణ, కార్యదర్శులు రాజ్యలక్ష్మి, సుజాత, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు రజనీకాంత్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఏనుగు రాజిరెడ్డి, రాంపల్లి ఎంపీటీసీ బల్‌రాం, జిల్లా నాయకులు గోపురమణారెడ్డి, తిరుమల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్, అమరం మోహన్‌రెడ్డి, లక్ష్మీపతిరాజు, బాల్‌రాజ్, శ్రీనివాస్, కీసర గ్రామశాఖ అధ్యక్షుడు మెట్టు మహేందర్‌యాదవ్, అధిక సంఖ్యలో కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపురం రైతు బజార్‌లో కూరగాయల ధరలు

నేరేడ్‌మెట్: టమాట-45, వంకాయ-28, బెండకాయ-25, పచ్చిమిర్చి-28, కాకరకాయ-18, బీరకాయ-21, క్యాబేజి-16, బీన్స్-33, క్యారెట్-53, కాలీఫ్లవర్-18, దొండకాయ-25, చిక్కుడు-38, గోకరకాయ-23, బీట్‌రూట్-23, కాప్సికం-36, ఆలుగడ్డ-14, కీర-15, దోసకాయ-18, సొరకాయ-13, పొట్లకాయ-13, కందగడ్డ-21, అరటి-10, చామగడ్డ-25, ముల్లంగి-9.



షోలాపూర్ టు మల్కాజ్‌గిరి

- అమ్మకాలకు సిద్ధంగా గణేశ్ విగ్రహాలు
- ఆకట్టుకుంటున్న బొజ్జగణపయ్యలు
- 20 రోజుల ముందునుంచే అమ్మకాలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న రంగురంగుల వినాయక విగ్రహాలు

మల్కాజిగిరి: దండాలయ్య ఉండ్రాలయ్య దయుంచయ్యా దేవా.. అంటూ పాడుకునే వినాయక చవితి రానే వచ్చింది. చవితికి మరో 15 రోజులు ఉండగానే రకరకాల వినాయక విగ్రహాలు మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. మల్కాజిగిరిలోని పలు ప్రాంతాల్లో ఎక్కడ చూసినా రంగురంగుల వినాయక విగ్రహాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. వినాయక విగ్రహాలతో ఆయా ప్రాంతాలు కళకళలాడుతున్నాయి. చిన్న విగ్రహాల నుంచి పెద్ద విగ్రహాల వరకు మల్కాజిగిరిలో లభ్యమవుతున్నాయి. ఇప్పటి నుంచే ఉత్సవ నిర్వాహకులు వారికి కావాల్సిన గణనాధులను బక్ చేసుకుంటున్నారు. 50 రూపాలయ వినాయక విగ్రహాల నుంచి 25 వేల రూపాయల వరకు లభ్యమవుతున్నాయి.

● షోలాపూర్ నుంచి ప్రత్యేక విగ్రహాలు

మహారాష్ట్రలోని షోలాపూర్‌లో వినాయక విగ్రహాల తయారీని మంచి పేరుండడంతో మల్కాజిగిరి వ్యాపారులు అక్కడి నుంచి విగ్రహాలను తీసుకొస్తున్నారు. దీంతో చిన్నిచిన్ని విగ్రహాల నుంచి భారీ అతి భారీ విగ్రహాల వరకు అక్కడి నుంచే తెప్పించి విక్రయిస్తున్నారు. షోలాపూర్ వినాయకుల విగ్ర హాలు అందంగానూ రంగుల్లోనూ, ప్రత్యేకతను సంతరించుకోవడంతో భక్తులు సైతం షోలా పూర్ విగ్రహాలను కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రతిఏటా విగ్రహాలను షోలాపూర్‌తో పాటు నగరంలోని దూల్‌పేట్, జహీరాబాద్, నాగారం ప్రాంతాల నుంచి తీసుకొచ్చి అమ్ముతుంటారు.



మల్కాజిగిరిలో మహాగణపతి విగ్రహాలు

● రవాణా ఖర్చులతో ఇబ్బందులు

షోలాపూర్ నుంచి విగ్రహాల తరలింపునకు ఎక్కువ ఖర్చు అవుతుండడంతో వ్యాపారులు సైతం ట్రాన్స్‌పోర్టు ఖర్చులు కలుపుకుని విగ్రహాల ధరలు నిర్ణయిస్తారు. షోలాపూర్ నుంచి ఇక్కడ వరకు విగ్రహాలను తరలించే క్రమంలో ఒక్కో భారీ విగ్రహానికి సుమారు రెండు నుంచి రెండున్న వేల వరకు ఖర్చు అవుతుంది. ఈ ఖర్చు కలుపుకుని విగ్రహాల ధరలు నిర్ణయించాల్సి వస్తుందని వ్యాపారులు అంటున్నారు. ఒక్కోసారి విగ్రహాలు ట్రాన్స్‌పోర్టులో విరిగిపోయే అవకాశాలు ఉంటున్నాయని దీంతో తాము కాస్త ఇబ్బందులు పడాల్సి వస్తుందని అంటున్నారు.

సరికొత్త డిజైన్లలో విగ్రహాలు

కాగా ప్రతీ సంవత్సరం భక్తులను ఆకట్టుకునేం విధంగా సరికొత్త రూపాలలో విగ్రహాలు మార్కెట్లోకి వస్తున్నాయి. వివిధ ఆకృతులతో ఆకట్టుకునే విధంగా ఉన్న రకరకాల విగ్రహాలను తీసుకువస్తున్నారు. దీంతో భక్తులు వాటిపైనే ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. ధర కొంత ఎక్కువైనా భక్తులు కొనుగోలు చేస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

25 ఏళ్లుగా వినాయక విగ్రహాల వ్యాపారం

25 సంవత్సరాలుగా వినాయక చవితికి వివిధ రూపాలలో ఉండే వినాయకులను తీసుకువచ్చి ఇక్కడ వ్యాపారం నిర్వహిస్తున్నాం. అయితే కొన్ని కొన్ని సందర్భాల్లో సరైన గిరాకీ లేక నష్టపోయిన సందర్భాలూ ఉన్నాయి. అయితే ఓ సంవత్సరం గిరాకీ బాగా లేకున్నా మరో సంవత్సరం అయినా వస్తుంది గదా ఈ వ్యాపారం చేస్తున్నాం. వినాయకుని దయవల్ల ఇప్పటి వరకు విగ్రహాల వ్యాపారం ఎలాంటి విఘ్నాలు లేకుండా కొనసాగిస్తున్నాం. 20 రోజుల ముందునుంచే అమ్మకాలు ప్రారంభిస్తాం. షోలాపూర్, దూల్‌పేట్, నాగారం, జహీరాబాద్‌ల నుంచి విగ్రహాలను తీసుకువస్తాం.



- నరేందర్, విగ్రహాల వ్యాపారి

చంద్రమౌళీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో వెలసిన శనిశ్వరుడు

అల్వాల్: అల్వాల్‌లోని శ్రీ ఉమాచంద్ర మౌళీశ్వర దేవాలయంలో ఈనెల 19న శని త్రయోదశని పురస్కరించుకుని స్వామి వారికి తైలాభిషేకాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ ప్రదానార్చకులు పెద్ది కృష్ణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 5 గంటల నుంచి మహాన్యాస పూర్వ శని మూలమంత్రంతో పాశుపత రుద్రముతో తైలాభిషేకాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అష్టమ శని, అర్ధష్టమ శని, జన్మ శని, ఏలినాటి శని వంటి దోషాలు ఉన్న భక్తులందరికీ మంచి అవకాశం అన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'ఆపరేషన్ బ్లెస్సింగ్ సేవలు అభినందనీయం'



అద్దాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: ఆపరేషన్ బ్లెస్సింగ్ ఇండియా సేవలు అభినందనీయమని కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆపరేషన్ బ్లెస్సింగ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర శిబిరానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధానం అనే ఆర్యోక్తిని ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. అన్ని అవయవాలలో కల్లా నేత్రాలు ఎంతో జాగ్రత్తగా చూసుకోవాలని ఆపరేషన్ బ్లెస్సింగ్ ఇండియా, ఉచిత నేత్ర వైద్య శిబిరాలను నిర్వహించడంతో పాటు కంటి అద్దాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 45 మందికి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చింతల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జార్జి, ప్రేమ్‌కుమార్, మల్లేష్‌గౌడ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవమే లక్ష్యం'



కుంతియాను కలిసిన బోనగిరి సురేష్

గౌతంనగర్ : కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు తెలంగాణ ఇంచార్జ్ ఆర్ సీ కుంతియా రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు బోనగిరి సురేష్‌యాదవ్ గాంధీ భవన్‌లో ఆయనను కలిసారు. రాష్ట్ర ఇంచార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన శుభ సందర్భంగా ఆయనకు శాలువ కంపి శుభాకాంక్షలు తెలిపారు. 2019లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే లక్ష్యంతో అదిష్టానం ఆయనకు బాధ్యతలు అప్పగించినట్లు సురేష్ యాదవ్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల పోరాటాలు, త్యాగాలు రాష్ట్ర అవసరాన్ని గుర్తించి ప్రత్యేక రాష్ట్ర ప్రకటన చేసిన ఘణత కాంగ్రెస్ పార్టీదే... ప్రజలను మభ్యపెట్టి అధికారం చేపట్టిన కేసీఆర్ నిజ స్వరూపం ప్రజలు అర్థం చేసుకుంటున్నారని సురేష్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి సంక్షేమాలు తప్ప మూడేళ్ల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు చేసింది సూన్యమేనన్నారు. మాటల గారడీ తప్ప ఒక్క పని నిర్ధిష్టంగా చేసింది లేదు. వీపైగా ప్రజలపై అడ్డగోలు బారాలు మోపుతున్నారని పేర్కొన్నారు. కొత్తగా నియమితులైన రాష్ట్ర ఇంచార్జీ కుంతియా నాయకత్వంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఐక్యతతో పని చేయడానికి సిద్దంగా ఉన్నారని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

మట్టి గణపతే మహాగణపతి



మట్టి వినాయకులతో చిన్నారులు

మల్కాజిగిరి : మట్టి గణపతే మహాగణపతి, మట్టి వినాయకులనే పూజిద్దాం.. మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకుందాం.. అందరికి ఆదర్శంగా నిలుద్దాం అనే ప్రత్యేకతతో మల్కాజిగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో మట్టి వినాయకులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల విద్యావనరుల కేంద్రం, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ సంయుక్త ఆద్వర్యంలో జిల్లా పరిషత్ పాఠశాలలోని ఎంఈఓ కార్యాలయం వద్ద బుధవారం విద్యార్థులకు మట్టి విగ్రహాల తయారీ, పై అవగాహనా కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. చిన్నారుల్లో సంస్కృతి, సాంప్రదాయాలను నింపేందుకు భావి భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా ఉండేందుకుగాను ఈ మట్టి వినాయకుల వాడకం పై అవగాహనను కల్పించారు. కార్యక్రమానికి మండల పరిధిలని వివిద పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాద్యాయులు, ఎన్జీసీ ప్రాజెక్టు అధికారి రాధికాదేవి, సైన్స్ అధికారి రవీందర్‌రాజు, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న మురళీధర్‌రావు

మల్కాజిగిరి : భారతీయ జనతాపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మరళీధర్‌రావుతో మల్కాజిగిరిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మంగళవారం రాత్రి శ్రీ అష్టోత్తర (108) శతచుక్కల చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు చుక్కల వేణుకుమార్ ఆద్వర్యంలో ఆర్‌కే నగర్‌లోని స్వాగత్‌గ్రాండ్ లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మురళీధర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ అష్టోత్తర శత చుక్కల ట్రస్టు చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. ముఖ్యంగా ప్రతిఏట ఏడు కొండల వెంకన్నను ఇక చూడలేమేమో అనుకున్న అనేక మంది వికలాంగులను తన ట్రస్టు ఆద్వర్యంలో ఉచితంగా వారిని తిరుపతి తీసుకవెళ్ళి వెంకన్న దర్శనం చేయించడం ఎంతో మహద్భాగ్యమని కొనియాడారు. కార్యక్రమంలో వినియోగ దారుల హక్కుల సంఘం అధ్యక్షుడు, ఉస్మానియా యునివర్సిటీ ప్రొఫెసర్ బాలకృష్ణ, పద్మశ్రీ నర్రారవికుమార్, గ్లోబల్ ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ రత్నాకర్, మల్కాజిగిరి మున్సిపల్ మాజీ ఛైర్మన్ గుడిమెట్ల సూర్యనారాయణ రెడ్డి, బీజేపీ స్వచ్ఛ భారత్ అభియాన్ రాష్ట్ర అద్యక్షుడు గార్లపాటి జితేందర్ కుమార్, లయన్స్ క్లబ్ సెకండ్ వైస్ గవర్నర్ రవీంద్ర నాద్ గుప్త, ప్రభుగుప్త హరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాల కోసం కప్పకావడి



కుదురుమళ్లలో కప్పకావడి నిర్వహిస్తున్న రైతులు

కొడంగల్: వర్షాలు ముఖం చాటేయడంతో గ్రామాల్లో రైతులు, గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు. దీంతో గ్రామాల్లో వరుణ దేవుడి కరుణ కోసం కప్పకావడి, సప్త భజనలు తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. బుధవారం మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో మహిళలు పెద్ద ఎత్తున రోకలికి వేప కొమ్మలు కట్టి దానికి కప్పను వేలాడదీసి కప్పకావడితో ప్రతి ఇంటికి వెళ్లి బిందెలతో నీళ్లు పోశారు. గత పదిహేను రోజులుగా వర్షాలు కురవకపోవడంతో మహిళలు కప్పకావడికి పూజలు నిర్వహిస్తూ పాటలు పాడుతూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో...

మండల పరిధిలోని కుదరుమళ్ల గ్రామంలో వర్షాలు కురవాలని కప్పకావడి నిర్వహించారు. బుధవారం కుదురుమళ్ల గ్రామంలో గ్రామస్థులు ఎండిపోయిన పంటలను వరుణ దేవుడు కాపాడాలని కప్పను కావడికి కట్టి పూజలు నిర్వహించారు. కప్పకావడితో గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు శ్రీను, గిరప్ప, ఆశప్ప, రాయప్ప తదితరులు పాల్గొన్నారు.



పాలెపల్లి గ్రామంలో కప్పకావడి నిర్వహిస్తున్న మహిళలు

పాలేపల్లిలో కప్పకావడి..

దోమ: మండల పరిధిలోని పాలెపల్లి గ్రామంలో బుధవారం గ్రామస్థులు వర్షాలు కురువాలని కప్పకావడి కార్యక్రమాన్ని నిర్వహించారు. గత కొన్ని రోజులుగా వర్షాలు ముఖం చాటేయడంతో గ్రామంలో రైతులు సాగు చేసిన పంటలు ఎండుదశకు చేరుకున్నాయి. వానలు కురువాలని ఎండిపోతున్న పంటలను కాపాడాలని వానదేవుణి కరుణకోసం మహిళలంతా కలసి కప్పకావడితో ఇంటింటికి తిరిగుతూ కప్పకావడిపై నీళ్లు పోశారు. వానలు కురిసి ఎండిపెతున్న పంటలకు జీవం పోయాలని చెరువులు, కుంటల్లో నీరు చేరాలని వాన దేవుణి పాటలు పాడుతూ, గ్రామ దేవతలను వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేటి నుంచి మిజిల్స్ రుబెల్లా టీకాలు



జిల్లా వైద్యాధికారి దశరథ్

అనంతగిరి : ఈనెల 17 నుంచి 25 వరకు జిల్లాలో మిజిల్స్ రుబెల్లా టీకాలను వేయడం జరుగుతుందని జిల్లా వైద్యాధికారి దశరథ్ అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని వైద్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 9,97,833మంది జనాభా ఉండగా 9నెలల నుంచి 15 సంవత్సరాలు వయస్సు కలిగిన వారు 2,62,728మంది ఉన్నారన్నారు. వీరికి టీకాలను దశల వారిగా వేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇందుకోసం మొదటి విడతలో అంగన్‌వాడి కేంద్రాలలో టీకాలు వేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. 1294 పాఠశాలలు, 1,111 అంగన్‌వాడి కేంద్రాలు ఉన్నాయన్నారు. ఈ టీకా ఇది వరకు వేసినా మళ్లి అదనపు డోస్ కింద వేయించాలన్నారు. వీటి నుంచి ఎలాంటి దుష్ప్రభావం ఉండదని ఆయన తెలిపారు.

జిల్లాకు ఆరోగ్య యోగం

- అనంతగిరిలో ఆయూష్ ఆసుపత్రి
- అయుష్ పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- రూ. 6 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- అటవీ ప్రాంతంలో ఔషధ మొక్కలు పెంచేలా చర్యలు

(ఆంధ్రజ్యోతి, వికారాబాద్) అనంతగిరికి ఆరోగ్య యోగం పట్టబోతోంది. అనంతగిరిలోని ప్రభుత్వ క్షయ, ఛాతి వ్యాధుల ఆసుపత్రి భవన సముదాయాల్లో ఆయుష్ ఆసుపత్రి ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అనంతగిరిలో ఆయుర్వేద, యోగ, యునానీ, సిద్ధ, హోమియోపతి, నేచురోపతి ఆసుపత్రులు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.6 కోట్లు మంజూరు చేసింది. ప్రకృతి వైద్యంతో పాటు హెల్త్ టూరిజం అభివృద్ధి చెందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. అనంతగిరిలో ఆయుష్ పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు జాతీయ ఆయుష్ మిషన్ అనుమతి ఇచ్చింది. ఆయుష్‌పైన పరిశోధనలు నిర్వహించేందుకు వీలుగా ఇక్కడ ఓ పరిశోధనా కేంద్రం కూడా ఏర్పాటు చేయనున్నారు. ఆయుర్వేద, యోగ, యునానీ, సిద్ధ, హోమియోపతి, నేచురోపతి విభాగాలకు సంబంధించిన చికిత్సలు అందించేందుకు వీలుగా ఇక్కడ మొదటగా 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయనున్నారు. ఆయుష్ పరిశోధనా కేంద్రం, ఆసుపత్రుల ఏర్పాటుకు అనంతగిరి కొండల్లోని ప్రభుత్వ క్షయ, ఛాతీ వ్యాధుల ఆసుపత్రికి సంబంధించి విశాలమైన భవన సముదాయాలను వినియోగించుకోనున్నారు. ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఛాతీ వ్యాధులు, మానసిక వ్యాధుల ఆసుపత్రులను అనంతగిరి కొండపైకి తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించగా, ఈ నిర్ణయాన్ని అప్పట్లో పలువురు వ్యతిరేకించారు. దీంతో ఈ విషయంలో ప్రభుత్వం వెనక్కితగ్గింది. అయితే అంతకు ముందే ప్రభుత్వం ఇక్కడ శిథిలావస్థకు చేరుకున్న ఆసుపత్రి భవన సముదాయాలను రాష్ట్ర ప్రభుత్వం ఏడు కోట్లతో పునరుద్దరించిన విషయం తెలిసిందే. ఈ నిధులతో ప్రభుత్వ క్షయ, ఛాతీ వ్యాధుల ఆసుపత్రి భవనాలు కొత్త శోభ సంతరించుకున్నాయి. ఆసుపత్రికి వచ్చే క్షయ వ్యాధి రోగుల సంఖ్య రోజు రోజుకు తగ్గుముఖం పడుతుండడంతో అనంతగిరి ఆసుపత్రి గత కొంత కాలంగా కళావిహీనంగా మారిన విషయం తెలిసిందే. అనంతగిరిలో ఆయూష్ ఆసుపత్రులు ఏర్పాటు చేయడమే కాకుండా అటవీ ప్రాంతంలో పెద్ద ఎత్తున ఔషధ మొక్కలు పెంచనున్నారు. హెర్బల్ గార్డెన్ కూడా ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. చాలా రోజుల తరువాత అనంతగిరిలో ఆయుష్ పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయం పట్ల స్థానికుల్లో హర్షం వ్యక్తమవుతోంది.



అనంతగిరి అటవీ ప్రాంతం (ఫైల్)

రోగులకు ప్రాణం పోసిన ఆసుపత్రి..

అనంతగిరిలో నిజాం ప్రభువు నిర్మించిన టీబీ హాస్పిటల్ ఎంతో మంది క్షయ వ్యాధిగ్రస్థులకు ప్రాణం పోసింది. నిజాం ప్రభుత్వం నిర్మించిన ఈ ఆసుపత్రి (శానిటోరియం) 1946 నుంచి ఇప్పటి వరకు తెలంగాణ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన లక్షలాది మంది క్షయ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించింది. అంతే కాకుండా వారిలో మానసిక స్థైర్యాన్ని పెంపొందించే విధంగా ఇక్కడ చికిత్స నిర్వహిస్తూ వచ్చారు. అనంతగిరికీ హవా.. లాకో మరీజోంకీ దవా అనే నానుడి గురించి ఆ నోటా, ఈ నోట తెలుసుకున్న నిజాం నవాబు 1928 ప్రాంతంలో కొంత కాలం గడిపేందుకు కుటుంబ సపరివారంగా ఇక్కడకు వచ్చారు. అటవీ ప్రాంతాన్నంతా కలియ తిరిగిన ఆయన అందులో వివిధ రోగాలను నయం చేసే వన మూలికలు ఉన్నాయని గుర్తించారు. అప్పట్లో క్షయవ్యాధి బారిన పడ్డ వారెవరికీ సరైన చికిత్స అందక మృత్యువాత పడ్డారు. ఆరోగ్యవంతమైన గాలితో పాటు సరైన చికిత్స అందేందుకు వన మూలికల చెట్లు ఉన్న అనంతగిరి అడవులే క్షయ వ్యాధిగ్రస్థులకు చికిత్స అందించేందుకు సరైన స్థలమని గుర్తించిన నిజాం నవాబు ఈ కొండల్లో సమతలంగా ఉన్న 450 ఎకరాల్లో 160 ఎకరాల విస్తీర్ణంలో 1930లో హైదరాబాద్ దక్కన్ ఛీఫ్ ఇంజనీర్ ఆధ్వర్యంలో ఉస్మానియా పేరుతో ఆసుపత్రి (ఉస్మానియా సాహేద్గా) సముదాయం నిర్మించారు. అంతర్గత రోడ్లు, అందమైన పూల తోటలు ఏర్పాటు చేశారు.

అనంతగిరి కొండలు సముద్ర మట్టానికి 2273 అడుగుల ఎత్తులో ఉన్నాయి. 1946లో ప్రారంభించిన ఈ క్షయ చికిత్సాలయం లక్షలాది మంది క్షయ వ్యాధిగ్రస్థులకు పునరుజ్జీవనం చేకూర్చింది. ఈ క్షయ ఆసుపత్రి 1946 నుంచి 1994 వరకు లక్షలాది మంది క్షయ వ్యాధిగ్రస్థులను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దింది. 60 ఎకరాల్లో రోగుల వార్డులు, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, ల్యాబ్, ఎక్స్‌రే ప్లాంట్, ఆపరేషన్, థియేటర్ తదితర భవనాలు ఉండగా, మరో 60 ఎకరాల్లో నర్సెస్ హాస్టల్, కిచెన్, మెడికల్ అధికారులు, సిబ్బంది నివాస గృహాలు ఉన్నాయి. ఏడు వార్డులు, పరిపాలనా భవనం ఉంది. క్షయ రోగులకు ఆరోగ్యకరమైన జీవితాన్ని ప్రసాదించి దేశంలోనే తనకంటూ ఈ ఆసుపత్రి మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న విషయం విదితమే.

హద్దుల నిర్ధారణ షురూ..

బషీరాబాద్ : తెలంగాణ-కర్ణాటక సరిహద్దు నది పరివాహక ప్రాంతమైన కాగ్నానదిలో కర్ణాటక అక్రమార్కులు కొందరు హిటాచీలతో ఇసుక తవ్వకాలు జరిపి టిప్పర్లలో అక్రమంగా తరలించడంపై పత్రికల ద్వారా వెలుగులోకి వచ్చిన విషయం విధితమే. ఈ కథనాలపై తాండూరు సబ్ కలెక్టర్ సందీప్‌కుమార్ తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు బషీరాబాద్ తహసీల్దార్ వెంకటయ్య నేతృత్వంలో రెవెన్యూ, మైన్స్ అధికారులు, ఆర్ఐ రమేష్, సహదేవ్, రెవెన్యూ సర్వేయర్ శ్రీహరి, వీఆర్వోలు నాగిరెడ్డి, పెంటయ్య, వీఆర్ఏలు సంయుక్తంగా బుధవారం సరిహద్దులోని బషీరాబాద్ మండలం క్యాద్గీర, గంగ్వార్, నవాంద్గీల మద్య నది పరివాహక ప్రాంతాన్ని కలియదిరిగి పరిశీలించారు. జీపీఎస్ సర్వే ద్వారా తెలంగాణ-కర్ణాటక వైపు నది ఒడ్డు నుంచి కొలతలు తీశారు. ఇప్పటికే కర్ణాటకకు చెందిన అక్రమార్కులు తెలంగాణ పరిధిలోకి వచ్చే నదిలోకి 30 మీటర్ల మేరకు లోపలికి చొచ్చుకువచ్చి ఇసుక అక్రమంగా తరలించుకుపోయినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్దారించారు. తెలంగాణ-కర్ణాటక సరిహద్దు ప్రాంతంగా ఉన్న నది వెడల్పు 100 మీటర్ల నుంచి 200 మీటర్ల మద్య ఉన్నట్లు అధికారులు సర్వే ద్వారా తేల్చారు. గంగ్వార్, క్యాద్గీర మద్య కాగ్నానది పరివాహక ప్రాంతంలో వేలాది క్యూబిక్ మీటర్ల ఇసుకను కర్ణాటకకు చెందిన అక్రమార్కులు గత కొంత కాలంగా భారీ ఎత్తున తరలించుకుపోయినట్లు అధికారులు స్వయంగా గుర్తించారు. ఏ మేరకు ఇసుక తరలించారనేదానిపై సమగ్ర సర్వే జరిపి నివేదికను సమర్పిస్తామని మైన్స్ అధికారులు తెలిపారు. రెండు రాష్ట్రాల సరిహద్దుగా ఉన్న కాగ్నానది ఒడ్డున ఇరువైపులా వ్యవసాయ భూముల పరిధిని సర్వేచేసి నది పరివాహక ప్రాంతం ఏ రాష్ట్రానికి ఎంత వస్తుందనేది గుర్తించి పక్కాగా హద్దులు తేలుస్తామని తహసీల్దార్ వెంకటయ్య చెప్పారు. తెలంగాణ కాగ్నానది పరివాహక ప్రాంతం ఒడ్డున ఉన్న నవాంద్గి, క్యాద్గీర గ్రామాల పరిధిలో సర్వేనెంబర్-241, 242, 243 అటు వైపు కర్ణాటక ప్రాంతం భూములు సర్వేనెంబర్-71, 72, 73, 74లలో వ్యవసాయ భూములను ప్రామాణికంగా తీసుకుని నదిపరివాహక ప్రాంతం ఎటువైపు ఎంత వస్తుందనేది తేలిపోతుందని అధికారులు అన్నారు. రెండు రాష్ట్రాల అధికారుల జాయింట్ సర్వేతో త్వరలో మరోసారి సర్వే చేపట్టి హద్దులను గుర్తిస్తామని అధికారులు వెల్లడించారు.

'దుకాణాదారుల సమస్యలు పరిష్కరిస్తాం'



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్ : తాండూరు పట్టణ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద దుకాణాల దారుల సమస్యలను మరోసారి సమావేశం నిర్వహించి పరిష్కరిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి తాండూరు ఆర్టీసీ డిపోలో బస్టాండ్ వద్ద ఉన్న దుకాణాదారుల సమావేశ ంలో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే దుకాణాలు కేటాయించేలా తన వంతు కృషి చేస్తామన్నారు. కొంత మంది దుకాణాలు వస్తాయో రావో అని అధైర్యపడవద్దని, అందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కరణం పురుషోత్తంరావు, పట్టణ అధ్యక్షుడు రవూఫ్, ఆర్టీసీ ఆర్ఎం యాదగిరి, డీఎం కృష్ణమూర్తి, తదితరులున్నారు.



డాక్ సేవక్ ల సమస్యలు పరిష్కరించాలంటూ బుధవారం తాండూరు పట్టణంలోని పోస్టాఫీసులో డాక్ సేవక్ యూనియన్ ప్రతినిధులు నిరవధిక సమ్మెకు దిగారు. ఏఐజీడీఎస్‌యూ సూచించిన సవరణలో జీడీఎస్ కమిటీ రిపోర్టు అమలు చేయాలి, జీడీఎస్‌లకు 8 గంటల పని కల్పించి సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలి, డిల్లీ క్యాట్ ప్రిన్సిపల్ బెంచ్, మద్రాస్ క్యాట్ బెంచ్ తీర్పు ప్రకారం డిమాండ్లు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్ సేవలు పాల్గొన్నారు. **(తాండూరురూరల్)**

నేడు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై సమీక్ష సమావేశాలు

మేడ్చల్/శామీర్‌పేట : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై మేడ్చల్, శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయా మండలాల ఎండీవోలు దేవసహాయం, జ్యోతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శామీర్‌పేటలో ఉదయం 10.30 గంటలకు, మేడ్చల్‌లో మధ్యాహ్నం 1.30 గంటలకు సమీక్షా సమావేశం ఉంటుందనీ, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు హాజరుకావాలని వారు కోరారు. సమావేశానికి ముఖ్య అతిథిలుగా జిల్లా కలెక్టర్ ఎం.వి.రెడ్డి. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొంటారనీ, హరితహారం, స్వచ్ఛభారత్, డంపింగ్‌యార్డు, వైకుంఠధామాలు తదితర అంశాలపై చర్చ ఉంటుందని వారు తెలిపారు.

ప్రముఖుల రాక-ఇబ్బందుల్లో విద్యార్థులు

- గంటల తరబడి ఎండలో నిలబడి అతిథుల కోసం ఎదురుచూపులు
- ఇబ్బందులకు గురౌతున్న ఉపాధ్యాయులు


మేడ్చల్‌లో రోడ్డుపై వేచి చూస్తున్న విద్యార్థులు(ఫైల్)

మేడ్చల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గంటల తరబడి రోడ్లపై నిల్చుని ప్రముఖుల రాక కోసం ఎదురు చూసి నీరసించిపోతున్నారు. మేడ్చల్ పట్టణంతో పాటు మండలంలో పలుచోట్ల మొక్కలు నాటే కార్యక్రమానికి పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, డిప్యూటీ స్పీకర్ తదితరులు పాల్గొంటున్నారు. కాగా ఈ కార్యక్రమానికి అధికారులు విద్యార్థులను తీసుకెళ్లి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారనే పలువురు విమర్శిస్తున్నారు. మేడ్చల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు మహేందర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి రాకకోసం విద్యార్థులు దాదాపు మూడు గంటలపాటు ఎండలో రోడ్లపై నిల్చోవాల్సి వచ్చింది. అదేవిధంగా హైటెక్ స్కూల్ సమీపంలో చేపట్టిన కార్యక్రమంలో కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేల కోసం విద్యార్థులు గంటల తరబడి రోడ్లపై ఎదురు చూడాల్సి వచ్చింది. ఇటీవల పూడూరులో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ స్పీకర్ రాకకోసం విద్యార్థులు గంటల తరబడి ఓ ప్రైవేటు పరిశ్రమ వద్ద ఎదురుచూడాల్సి వచ్చింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వేలాది మంది విద్యార్థులను రోడ్లపై గంటల తరబడి నిలపెట్టి తీరా ప్రముఖులు ఇలా వచ్చి అలా ఓ మొక్క నాటి వెళ్లిపోవడంతో అంతవరకు గంటలతరబడి రోడ్లపై నిలబడి ఎదురు చూసిన విద్యార్థులు, ఏర్పాట్లు చేసిన ఉపాధ్యాయులు ఉసూరుమంటున్నారు. అసలు ఎందుకు తీసుకొచ్చారు ? ఎందుకు ఎండలో నిలబెట్టారు ? అంటూ ఆవేదన చెందుతున్నారు. అధికారికంగా నేడు ఏ కార్యక్రమం చేపట్టినా విద్యార్థులను ఉపయోగించుకోవడం పరిపాటిగా మారిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. హరితహారంలో విద్యార్థుల పాత్ర ఉండాలనే ప్రభుత్వం ఉద్దేశం మంచిదే అయినప్పటికీ క్షేత్ర స్థాయిలో మరోవిధంగా ఉంది. హరితహారంలో భాగంగా విద్యార్థులతో మొక్కలు నాటించాల్సినప్పటికీ కేవలం స్వాగతం తెలపడం వరకే పరిమితమవుతున్నారు. ప్రముఖులు సమయభావంతో ఆగమేఘాలపై వచ్చి అంతే వేగంతో మొక్కలు నాటి వెళ్లిపోతున్నారు. దీంతో గంటల తరబడి రోడ్డుపై వేచిచూస్తున్న విద్యార్థులు నీరసించిపోవడం తప్ప ఒరిగేదేమీలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇంతమాత్రం దానికి విద్యార్థులను ఎందుకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. పైగా అధికారుల తీరుతో పలువురు విద్యార్థులు అనారోగ్యాలపాలవుతున్నారు. గంటల కొద్ది రోడ్లపై నిల్చోవడం, ఆ సమయంలో కనీసం తాగేందుకు నీరు లేకపోవడంతో పలువురు విద్యార్థులు స్పృహ కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. రాత్రికి రాత్రి ఆదేశాలు వస్తుండటంతో తెల్లారిసరికల్లా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన వేలాది మంది విద్యార్థులను కార్యక్రమానికి సిద్ధం చేయాల్సి వస్తుందని పలువురు ఉపాధ్యాయులు వాపోతున్నారు. చదువుకోవాల్సిన విద్యార్థులు రోడ్లపై గంటల తరబడి నిరీక్షించడం పట్ల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు విద్యార్థుల ఇబ్బందులను అర్థం చేసుకుని గంటల తరబడి రోడ్లపై నిలబెట్టకుండా సరైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.


నియామకపత్రాన్ని అందుకుంటున్న కమిటీ సభ్యులు

విశ్వబ్రాహ్మణ సంఘం ఎన్నిక

మేడ్చల్ : మేడ్చల్ నగర పంచాయతీ పరిధి కిష్టాపూర్ బంగారు మైసమ్మ ఆలయంలో విశ్వబ్రహ్మణ సంఘాన్ని మండల కన్వీనర్ విష్ణు చారి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వడ్ల సత్యనారాయణ చారి, ఉపాధ్యక్షులుగా శానాల కాశీనాద్‌చారి, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్‌చారి, జాయింట్ సెక్రటరీగా శానాల కన్నయ్య చారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మొలంగిరి సత్యనారాయణచారి, ఆకునూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వే


బాబాగూడలో సర్వే చేస్తున్న అధికారులు

శామీర్‌పేట రూరల్ : మండలంలో రెవెన్యూ అధికారులు ఇంటింటికి తిరిగి రెవెన్యూ రికార్డుల సర్వేను ముమ్మరంగా చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 1న మండలంలో తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి రెవెన్యూ రికార్డుల సర్వేను ప్రారంభించారు. మండలంలోని గ్రామాల వారీగా సంబంధిత వీఆర్వో, వీఆర్‌ఏలు ఇంటింటికి వెళ్లి స్వయంగా రైతులతో మాట్లాడి విచారణ జరిపి భూముల రికార్డుల వివరాలను నమోదు చేసుకుంటున్నారు. పట్టా భూములకు సంబంధించి రెవెన్యూ పహాణి నఖళ్లలో తప్పులు సవరిస్తున్నారు. బుధవారం బాబాగూడలో అధికారులు సర్వే చేపట్టారు. ఇంతవరకు మండలంలోని మురారిపల్లి, నాగిశెట్టిపల్లి, అనంతారం, అద్రాస్‌పల్లి, సింగాయపల్లి గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు.

18న వీరశైవ సాహిత్య సదస్సు

మేడ్చల్ : శ్రీశైలంలో నిర్వహిస్తున్న వీరశైవ సాహిత్య సదస్సుకు మేడ్చల్ నుంచి పెద్ద సంఖ్యలో వీరశైవలు తరలి వెళుతున్నట్లు ఆ సంఘం నాయకుడు సిద్దిలింగప్ప బుధవారం తెలిపారు. శ్రీశైలంలో ఈ నెల 18న ప్రారంభమయ్యే వీరశైవసాహిత్య సదస్సు మూడు రోజుల పాటు జరుగుతుందని ఆయన తెలిపారు. మేడ్చల్ నుంచి దాదాపు 20 మంది వీరశైవలు సదస్సుకు తరలివెళ్తున్నట్లు ఆయన తెలిపారు.


కొంపల్లిలోకార్యక్రమానికి హాజరైన మంత్రి కేటీఆర్‌ను మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, శామీర్‌పేట మండల ఎంపీపీ చంద్రశేఖర్, టీఆర్‌ఎస్ నేతలు శేఖర్‌గౌడ్, ఎం.నర్సింహారెడ్డి, ఎం.మోహన్‌రెడ్డి, మోనార్క్ తదితరులు కలిసి పూలబొకే అందించి అభినందనలు తెలియజేశారు. ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి కూడా ఉన్నారు. - మేడ్చల్

నేడు రాజబొల్లారంలో విగ్రహ ప్రతిష్ఠాపన

మేడ్చల్ రూరల్: మేడ్చల్ మండలం రాజబొల్లారం గ్రామంలో నేడు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ దేశం నారాయణగౌడ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలో మహంకాళమ్మ, దుర్గమ్మ, పోచమ్మ విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఇందు కోసం ఆలయాలను అందంగా ముస్తాబు చేసినట్లు ఆయన చెప్పారు. ఆదివారం బోనాలు ఉంటాయని సర్పంచ్ పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత...

మేడ్చల్ : చెట్ల కొమ్మల నరికివేత కారణంగా నేడు(గురువారం) గుండ్లపోచంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మైసమ్మగూడ, కండ్లకోయ గ్రామాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని వారు కోరారు.

నేడు కూకట్‌పల్లిలో కలెక్టర్ పర్యటన

కూకట్‌పల్లి: మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఎం.వి. రెడ్డి గురువారం కూకట్‌పల్లిలో పర్యటించనున్నారు. ఉదయం 11గంటలకు రూబెల్లా టీకాల పంపిణీ కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొంటారని ఎంఈవో పేర్కొన్నారు.

జోనల్‌స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

శామీర్‌పేట రూరల్: గ్రామీణ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొని పతకాలను సాధించాలని ఎంపీపీ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం శామీర్‌పేట మండలం మజీద్‌పూర్‌లో జైన్ హెరిటేజ్ పాఠశాల క్యాంపస్‌లో 63వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో జోనల్ స్థాయి రెండు రోజుల క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాపోటీలకు పలు పాఠశాలల నుంచి విచ్చేసిన క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందిస్తూ మొదటి రోజు వాలీబాల్, కబడ్డీ, పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు క్రీడల్లో శిక్షణ పొంది అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. క్రీడాకారులు పాఠశాల, గ్రామం, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. రెండు రోజుల పాటు క్రీడలను నిర్వహిస్తున్నట్లు జోనల్ క్రీడల ఇన్‌ఛార్జ్ మురళీకృష్ణ తెలిపారు. అండర్-14, 17 బాలబాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు, సెలక్షన్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బుధవారం కబడ్డీ, వాలీబాల్, గురువారం ఖోఖో పోటీలు ఉంటాయన్నారు. మండలంలోని 15 పాఠశాలల నుంచి విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ బండారి శ్రీనివాస్, పీఈటీలు సత్తిరెడ్డి, కేశవనాథ్, గోపాల్‌చారి, ఆనంద్, సిద్ధార్ధ, ప్రిన్స్ పాల్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ తదితరులు


కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారిణులు

ఐక్యత దిశగా గ్రామాలు

● రెండు గ్రామాల్లో ఒక్క గణేషుడే

● తీర్మానం చేసిన లక్ష్మాపూర్, తుర్కపల్లి గ్రామాల ప్రజలు

శామీర్‌పేట రూరల్: శామీర్‌పేట మండలం లక్ష్మాపూర్, తుర్కపల్లి గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు ఒక్క తాటిపైకి వచ్చారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర సీఎం కేసీఆర్ మండలంలోని లక్ష్మాపూర్, కేశవరం, మూడుచింతలపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడారు. ఆ దిశలోనే గ్రామాలు నడుస్తున్నాయి. ప్రతి సంవత్సరం గ్రామాల్లో పదుల సంఖ్యలో గణేషులను పెట్టెవారు. కాగా ప్రస్తుతం గ్రామంలోని పంచాయతీ పాలకవర్గం, యువజన సంఘాల నాయకులు ఎకతాటిపైకి వచ్చి ఒక్క వినాయకుడినే పెట్టుకుంటామని, కాలుష్య నివారణకు పాటుపడతామని, రణగొణుల శబ్దాలకు స్వస్తి చెప్తామని మండలంలోని ప్రజలు సీఎం కేసీఆర్ చెప్పిన మాటలను తూచ తప్పకుండా పాటిస్తున్నారు. అదేకోవలో లక్ష్మాపూర్, తుర్కపల్లి గ్రామాల ప్రజలు ప్రతిజ్ఞ చేస్తున్నారు. వెంటనే సంబంధిత పోలీస్ శాఖ అధికారులకు వినతి పత్రాలు ఇస్తున్నారు. ఒక్క వినాయకుడికే అనుమతులు ఇవ్వాలని గ్రామస్థులు కోరుతు స్థానిక ఎస్ఐ నవీన్‌రెడ్డికి గ్రామ సర్పంచ్ కటికెల శ్యామల ఆధ్వర్యంలో వినతి ప్రతిని అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నర్సిములు, ఎంపీటీసి సక్రి, వార్డు సభ్యులు చిత్తయ్య, పవన్, రవీందర్, ఎస్ఎంసీ చైర్మన్ జగన్నాథం, ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్త, రైతు సంఘం మండలాధ్యక్షుడు సింగం ఆంజనేయులు, యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తప్పుల సవరణకే రైతు సమగ్ర సర్వే

జాయింట్ కలెక్టర్ ధర్మారెడ్డి

ఘట్‌కేసర్ రూరల్: రెవెన్యూ రికార్డులలో తప్పులను సవరించుకోవడానికి రైతులకు సమగ్ర సర్వేలు ఎంతగానో ఉపయోగపడుతాయని జిల్లా జాయింట్ కలెక్టర్ ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని ఏదులబాద్ రైతు భవనంలో బుధవారం జరిగిన రైతు సమగ్ర సర్వే కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. రైతులు తమ పాసు పుస్తకాలను తీసుకొచ్చి ప్రభుత్వ రికార్డులలో సరిగ్గా ఉన్నాయా లేదా అని రెవెన్యూ అధికారులకు చూపించారు. అనంతరం జేసీ ధర్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ రికార్డులలో రైతుల పాసుపుస్తకాలలో ఎమైనా తప్పులు ఉన్న సవరిస్తారని తెలిపారు. అంతెకాకుండా చనిపోయిన వారి పేర్లు రికార్డులలో వచ్చిన వారి పేర్లను రికార్డుల నుంచి తొలగించి వారికి సంబంధించిన వారసుల పేర్లను నమోదు చేయనున్నట్లు తెలిపారు. క్షుణ్ణంగా రికార్డులను పరిశీలించి తప్పులు దొర్లకుండా చూడాలని రెవెన్యూ అధికారులను అదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ బట్టె శంకర్, తహసీల్దారు రాజేశ్వర్‌రెడ్డి, అర్ఐ కృష్ణ చైతన్య, విఅర్వోలు నరేందర్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహ్మద్ అన్వర్‌కు ఘన సన్మానం

51వ ఏషియన్ బాడి బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక



అన్వర్‌ను సన్మానిస్తున్న సర్పంచ్, అయా సంఘాల నాయకులు

ఘట్‌కేసర్ రూరల్: 51వ ఏషియన్ బాడి బిల్డింగ్ చాంపీయన్‌షిప్ పోటీలకు ఎంపికైన మహ్మద్ అన్వర్‌ను గ్రామస్థులు, అయా యువజన సంఘాల నాయకులు, గ్రామ సర్పంచ్ బట్టు శంకర్ బుధవారం ఘనంగా సన్మానించారు. మండలంలోని ఏదులాబాద్ జిల్లా పరిషత్ పాఠశాలలో, మరిపల్లిగూడ గ్రామాలలో మహ్మద్ అన్వర్‌కు గ్రామసర్పంచ్, అయా యువజనసంఘాల నాయకులు, 200-2001 క్లాస్‌మేట్స్ సన్మాన కార్యక్రమంను ఏర్పాటు చేశారు. ఈ నెల 20 నుంచి 26 వరకు సౌత్ కొరియాలోని సియోల్‌లో జరిగే 51వ ఏషియన్ బాడి బిల్డింగ్ చాంపీయన్‌షిప్ పోటీలలో పాల్గొంటాడు. భారతదేశపు తరుపున 70 కిలోల విభాగంలో సీనియర్ బాడీ బిల్డింగ్ పోటీలలో పాల్గొంటాడు. ఈ సందర్భంగా సర్పంచ్ శంకర్ మాట్లాడుతూ అన్వర్ భారత్‌దేశం తరుపున అడి దేశానికి మన ప్రాంతానికి మంచి పేరుతీకురావాలని కోరారు. అనంతరం మహ్మద్ అన్వర్ మాట్లాడుతూ నా ప్రతిభ గుర్తించిన భారత్ బాడీ బిల్డింగ్ ఫేడరేషన్ (ఐబిబిఎఫ్)కు ముందుగా ధన్యావాదాలు తెలిపారు. దేశం కోసం పోటీలలో పాల్గొని గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. పాఠశాల నుంచి ఘట్‌కేసర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మంకం రవి, వార్డు సభ్యులు ఎంకె కోండమ్మ, సురేష్‌గౌడ్, లక్ష్మణ్, టీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కందుల కుమార్, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై సమాలోచనలు

- ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు చర్యలు
- నేటి నుంచి 19 వరకు మండలాల వారీగా సమీక్షలు
- సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు
- ముఖ్యమంత్రి హామీలపై ప్రతిపాదనలు
- సంక్షేమ పథకాలు అర్హులైన వారికి చేరేలా చర్యలు

(ఆంధ్రజ్యోతి, మేడ్చల్‌జిల్లా ప్రతినిధి)

జిల్లాను అన్నిరంగాల్లోనూ అభివృద్ధి పరిచేందుకు జిల్లాయంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటుంది. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై దృష్టి సారించింది. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యులను చేయనుంది. పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పనపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. మేడ్చల్‌జిల్లా పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు సన్నాహాలు చేస్తోంది. జిల్లాలోని గ్రామాల వారీగా ప్రణాళికలు రూపొందిస్తుంది. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను ఎప్పటికప్పుడు సమన్వయ పరిచేందుకు ప్రత్యేక అధికారులను నియమించింది. గ్రామాల్లో చేపట్టనున్న పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులు సమాలోచనలు చేయనున్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మండల స్థాయిలో సమీక్షలు నిర్వహించనుంది. జిల్లాకలెక్టర్ ఎం.వి.రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 17 నుంచి 19వరకు మండలాల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. నేడు శామీర్‌పేట, మేడ్చల్ మండలాల్లో ప్రజానిధులు, అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారు అదేవిధంగా ఈ నెల 18న ఘట్‌కేసర్, కీసర, 19న కుత్బుల్లాపూర్ మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహించనున్నారు. ఈ సమీక్షా సమావేశాల్లో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, స్వచ్ఛ్ భారత్ మిషన్, బహిరంగ మల మూత్ర విసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు, హరితహారం, డంపింగ్‌యార్డు అభివృద్ధి పనులు, వైకుంఠధామం నిర్మాణాలు, తదితర అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఉన్నతాధికారులతో కలిసి జిల్లాలోని శామీర్‌పేట్ మండలంలోని కేశవరం, లక్ష్మాపూర్, మూడుచింతలిపల్లి గ్రామాల్లో పర్యటించి, గ్రామసభలు నిర్వహించారు. మూడు గ్రామాలకు దాదాపు రూ.60కోట్ల మేరకు అభివృద్ధి పనులకు హామీలు ఇచ్చారు. అభివృద్ధి పనులకు సంబంధించి అంచనాలపై ప్రతిపాదలు రూపొందించనున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సంబంధిత శాఖలు సమాయత్తం అవుతున్నాయి. జిల్లాలో దాదాపు 10లక్షల మంది వివిధ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నారని, పరిశ్రమల్లో, ఇతర సంస్థల్లో పనిచేస్తున్నారని, వీరి జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు తగిన ప్రణాళికలు రూపకల్పన చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధితో పాటు పచ్చదనం, పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 73శాతం అక్షరాస్యత ఉంది. విద్యాశాఖను పటిష్టం చేసి 100శాతం అక్షరాస్యత సాధించే దిశగా ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు ఆ శాఖ అధికారులు పాఠశాలల వారీగా తనిఖీలు చేపట్టి, నాణ్యమైన విద్యతోపాటు విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో వ్యవసాయం సాగు తక్కువగా ఉంది. జిల్లాలో ఒకటో వంతు మాత్రమే పలు పంటలను సాగు చేస్తున్నారు. అయితే చాలామంది రైతులు ఒకే రకమైన పంటసాగును చేస్తున్నారు. వ్యవసాయ భూములు ఉన్నప్పటికీ సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. దీంతో పాటు రైతులు అధిక దిగుబడులు వచ్చే పంటలపై ఆసక్తి చూపడంలేదు. నగరానికి చేరువలో ఉన్నందున రైతులకు మార్కెటింగ్ సౌకర్యం కూడా ఇబ్బందిలేదు. ఈ నేపథ్యంలో పలు వాణిజ్య పంటలు, ఉద్యానసాగు, వ్యవసాయ అనుబంధ రంగాలైన ఫౌల్ట్రీ, డైరీ, గొర్రెల, మేకలు పెంపకం వంటి రంగాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు నివేదికలు రూపొందిస్తున్నారు. వీరికి మార్కెటింగ్‌పై కూడా అవగాహన కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. పరిశ్రమలకు నిలయంగా ఉన్న ఈ జిల్లాలో మరిన్ని నెలకొల్పే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేసేందుకు గానూ తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. యువతకు ఉపాధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. అన్ని వర్గాల ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పలుపథకాలు, కార్యక్రమాలపై ప్రజలకు చేరువయ్యేలా తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. జిల్లాలో మొత్తం 77 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటిలో కీసర మండలంలో 12 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అదేవిధంగా శామీర్‌పేట్‌లో మండలంలో 24, మేడ్చల్‌లో 16, ఘట్‌కేసర్‌లో 21 కుత్బుల్లాపూర్ మండలంలో 6, బాచుపల్లిలో 2, గండి మైసమ్మలో 4 వరకు గ్రామపంచాయతీలు ఉన్నాయి. గ్రామాల్లో జనాభా రోజురోజుకు రెట్టింపు అవుతోంది. జనానికి అనుగుణంగా కనీస సౌకర్యాలు లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. చాలా వరకు గ్రామాల్లో చెత్త, చెదారం అంతా రోడ్డుపైనే వేస్తున్నారు. గ్రామపంచాయతీలకు సరిపడ డంపింగ్ యార్డులు లేవు. మురికి కాలువలు కూడా సరిపడ లేకపోవడంతో మురుగు రోడ్డుపై వచ్చి పారుతోంది. దీంతో పరిసర ప్రాంతాలన్నీ అపరిశుభ్రతకు నిలయంగా మారి ప్రజల అంటువ్యాధుల భారిన పడే అవకాశం ఉంది. పలు పంచాయతీల్లోని కాలనీలకు రోడ్డు సౌకర్యం లేదు. పలు సమస్యల పరిష్కరించేందుకు సమావేశాల్లో సమాలోచనలు చేయనున్నారు.

సమష్టి కృషితోనే సాధ్యం

● 'స్వచ్ఛ' మేడ్చల్‌గా ప్రకటించడం గర్వకారణం ● బహిరంగ మల విసర్జన రహిత జిల్లాల జాబితాలో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా

● దేశంలో జిల్లా 179వ స్థానం, రాష్ట్రంలో మూడో స్థానం ● ఇక మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు

● ప్రతి మరుగుదొడ్డికి జియోట్యాగింగ్ ● స్వచ్ఛ మేడ్చల్‌కు కృషి చేసిన వారందరికి కృతజ్ఞతలు● విలేకరుల సమావేశంలో కలెక్టర్ ఎం.వి.రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వి.రెడ్డి, జిల్లా అధికారులు

కీసర రూరల్: జిల్లాను బహిరంగ మల మూత్ర విసర్జన రహిత(ఓడీఎఫ్) జిల్లాగా ప్రకటించడం గర్వంగా ఉందని జిల్లా కలెక్టర్ యం.వి.రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఓడీఎఫ్ జిల్లాల్లో మన మేడ్చల్ జిల్లాను 179వ జిల్లాగా చేర్చడం జరిగిందన్నారు. భారత ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ వెబ్‌సైట్‌లో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు సంబంధించిన వివరాలను నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి గ్రామంలో అధికారులు, ప్రజప్రతినిధుల సహకారంతో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరిగిందని వెల్లడించారు. అంటువ్యాధులు వ్యాప్తికి కారణమైన బహిరంగా మలమూత్ర విసర్జనే కారణమని, అందుకు అనుగుణంగా గ్రామాల్లో ప్రతి ఇంటిలో మరుగుదొడ్డిని నిర్మించేకునేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగంపై అధికారులు, ప్రతినిధులు పలుమార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాను ఓడీఎఫ్‌గా చేసేందుకు ప్రజప్రతినిధులు, అధికారులు ఎంతో కృషి చేశారన్నారు. నోడల్ అధికారిగా డీపీవోను నియమించడం జరిగిందని, అలాగే డీఆర్‌డీఏ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ల శ్రమవల్లనే స్వచ్ఛ మేడ్చల్ జిల్లా సాధ్యమైందని తెలిపారు. నిర్మించిన ప్రతి మరుగుదొడ్డికి జియో ట్యాగింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అన్ని గ్రామపంచాయతీలకు డంపింగ్ యార్డులను కేటయించడం జరిగిందని, ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించి వర్మీ కంపోస్ట్ తయారు చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వివరించారు. బస్టాండ్‌లు, మార్కెట్ యార్డుల్లో కమ్యూనిటీ టాయిలెట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. స్వచ్ఛభారత్ లక్ష్యంలో రాష్ట్రంలో మేడ్చల్ జిల్లా మూడోస్థానంలో ఉందన్నారు. ఓడీఎఫ్ జిల్లాగా ప్రకటించినందుకు కలెక్టర్‌గా తనకు సంతోషంగా ఉందన్నారు.

ఇందుకు సహకరించిన అధికార యంత్రా ంగం, ప్రజప్రతినిధులకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో డీఆర్‌వో సురేందర్‌రావు, డీపీవో సురేష్‌మోహన్, డీఆర్‌డీవో కౌటిల్య తదితరులు పాల్గొన్నారు.

మృతుడి ఘటనపై నేడు విచారణ..

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్)

మహబూబ్‌నగర్ జైల్లో శిక్ష అనుభవిస్తూ, ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై నేడు షాద్‌నగర్ ఆర్డీవో ఎం.కృష్ణ విచారణ జరపనున్నారు. ఫరూక్‌నగర్ మండలం జానంపేటకు చెందిన సున్నాల నర్సింహులు(26) మొయినాబాద్ మండలంలో నివసిస్తున్నాడు. ఓ కేసులో మహబూబ్‌నగర్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు. అతడు ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గత నెల 16న మృతి చెందాడు. ఈ కేసుకు సంబంధించి ఆర్డీవో కార్యాలయంలో మెజిస్టీరియల్ విచారణ జరపనున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు తెలిసిన వారు తమ వాంగ్మూలాన్ని నేడు నిర్వహించే విచారణలో తెలిపాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

ఫ్యాకల్టీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్)

సైదాబాద్ లక్ష్మీనగర్ కాలనీలోని బీసీ స్టడీ సర్కిల్‌లో సివిల్ సర్వీసెస్ శిక్షణ తీసుకునే అభ్యర్థులకు పేపర్-1, పేపర్-2లకు సంబంధించిన సబ్జెక్టులు బోధించేందుకు అర్హత, అనుభవం కలిగిన ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల ఫ్యాకల్టీ బయోడేటాతో డైరెక్టర్, బీసీ స్టడీ సర్కిల్, రోడ్ నెంబర్-8, లక్ష్మీనగర్ కాలనీ, ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ ఎదురుగా సైదాబాద్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. పూర్తి వివరాలకు కార్యాలయం ఫోన్ నెం. 040-24071178 సంప్రదించాలని కోరారు.

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా కవిత

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్)



సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా జి.కవిత ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు చక్రపాణి చేతుల మీదుగా ఎన్నిక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, సీఐటీయూలో పదవి పెరగటంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. 15 ఏళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా 83 వేల మంది కార్మికులు మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్నారని తెలిపారు. అత్యంత తక్కువ వేతనాలకు కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. కనీస వేతనం రూ. 18 వేలు చెల్లించాలనీ, అలాగే పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, సాంఘిక భద్రత కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు.

20న ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు : ఈ నెల 20న తలకొండపల్లి మండలం పడకల్ ఆవేర్ ఆసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ కార్యదర్శి మోహన్‌రెడ్డి, పీఆర్వో ఎమ్.డి.పాష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఆమనగల్లు లయన్స్ క్లబ్, ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్నట్లయితే ఐవోఎల్ అపరేషన్లు చేయించడం జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని తలకొండపల్లి మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మోహన్‌రెడ్డి, పాష కోరారు.

జోనల్‌స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

శామీర్‌పేట రూరల్: గ్రామీణ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొని పతకాలను సాధించాలని ఎంపీపీ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం మజీద్‌పూర్‌లో జైన్ హెరిటేజ్ పాఠశాల క్యాంపస్‌లో 63వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో జోనల్ స్థాయి రెండు రోజుల క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడా పోటీలకు పలు పాఠశాలల నుంచి విచ్చేసిన క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందిస్తూ మొదటి రోజు వాలీబాల్, కబడ్డీ, పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు క్రీడల్లో శిక్షణ పొంది అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. క్రీడాకారులు పాఠశాల, గ్రామం, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

రెండు రోజుల పాటు క్రీడలను నిర్వహిస్తున్నట్లు జోనల్ క్రీడల ఇన్‌ఛార్జ్ మురళీకృష్ణ తెలిపారు. అండర్-14, 17 బాలబాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు, సెలక్షన్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బుధవారం కబడ్డీ, వాలీబాల్, గురువారం ఖోఖో పోటీలు ఉంటాయన్నారు. మండలంలోని 15 పాఠశాలల నుంచి విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ ఛైర్మన్ బండారి శ్రీనివాస్, పీఈటీలు సత్తిరెడ్డి, కేశవనాథ్, గోపాల్‌చారి, ఆనంద్, సిద్ధార్ధ, ప్రిన్స్‌పాల్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్య 'హారం'

హరితహారంలో జిల్లాకు అథమ స్థానం
ప్రభుత్వశాఖలన్నీ దాదాపు విఫలం
ఈ ఏడాది లక్ష్యం 1.70 కోట్లు
ఇప్పటి వరకు నాటిన మొక్కలు 49 లక్షలు
ఇందులో రెండుశాఖలు నాటిన మొక్కలే 40 లక్షలు
ఈ లెక్కలపైనా అనుమానాలే

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

వృక్ష సంపదను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న హరితహారం కార్యక్రమం జిల్లాలో అభాసుపాలవుతోంది. మూడో విడత జిల్లాలో చేపట్టిన ఈ కార్యక్రమం అమల్లో అడుగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఈ ఏడాది హరితహారం కార్యక్రమం విజయవంతం చేసేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసినప్పటికీ అవి కాగిత లెక్కలకే పరిమిత మయ్యాయి. ఈ పథకం అమల్లో రాష్ట్రంలోనే జిల్లా చివరి నుంచి రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు 91.77 శాతం లక్ష్యాలు సాధించి నిజామా బాద్ జిల్లా అగ్రస్థానంలో ఉండగా రంగారెడ్డి జిల్లా 29.07 శాతమే మొక్కలు నాటి అథమస్థానంలో నిలిచింది. వికారాబాద్‌జిల్లా పరిస్థితి కూడా దాదాపు ఇంతే ఉంది. వికారాబాద్ హరితహారం అమల్లో చివరి నుంచి మూడోస్థానంలో నిలిచింది. జిల్లాలో ఈ ఏడాది హరితహారం పథకం కింద 1.70 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే ఇందులో ఇప్పటివరకు 49.41 లక్షలు మాత్రమే నాటారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసినప్పటికీ హరితహారం కార్యక్రమం జిల్లాలో ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు. గడిచిన నెలలో వర్షాలు సరిగా పడకపోవడమే కారణమని అధికారులు చెబుతున్నప్పటికీ జిల్లాలో ఈ ఏడాది సగటు కంటే అధికంగా పడ్డాయి. ఈ ఖరీఫ్‌లో సగటు కంటే 22 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. అయితే ఈ మేర జిల్లాలో మొక్కలు నాటే కార్యక్రమం జరగలేదు. ఈ కార్యక్రమం అమల్లో పలుశాఖలు తీవ్ర నిర్లక్ష్యం చూపిస్తున్నాయి. రెండు, మూడు శాఖల తప్పా మిగతా శాఖలన్నీ కనీసం పదిశాతం మొక్కలు కూడా నాటలేదు. ఇందులో జైళ్లశాఖతో పాటు పలు శాఖలు తీవ్ర నిర్లక్ష్యాన్ని చూపుతున్నాయి. హరితహారం కార్యక్రమంలో కీలక భాగస్వామిగా ఉన్న అటవీశాఖ నిర్ధేశించిన లక్ష్యాల మేర ఈ కార్యక్రమాన్ని అమలు చేయడంలేదు. హరితహారం అమల్లో వెనుకబడిన శాఖల్లో అటవీ శాఖ కూడా ఉండడం అధికారులను నివ్వెరపరుస్తోంది. అటవీశాఖ ఈ ఏడాది 16.88 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్ణయించింది. ఇందులో ఇప్పటి వరకు కేవలం 2.93 లక్షల మొక్కలు మాత్రమే నాటింది. వ్యవసాయశాఖ 45.56 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 11.96 లక్షల మొక్కలు నాటినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. ఈ లెక్కలపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విద్యాశాఖ నాలుగు లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 88 వేల మొక్కలు నాటింది. పంచాయతీరాజ్ శాఖ నాలుగు లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా కేవలం 13 వేల మొక్కలు మాత్రమే నాటారు. అలాగే ఇరిగేషన్‌శాఖ రెండు లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా కేవలం 16 వేల మొక్కలు నాటింది. ఎక్సైజ్‌శాఖ 8 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించగా ఇప్పటివరకు 1.11 లక్షల మొక్కలు నాటింది. మున్సిపల్ శాఖ నాలుగు లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా 1.17 లక్షల మొక్కలు నాటారు . వైద్య, ఆరోగ్యశాఖ లక్ష మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా కేవలం మూడు వేల మొక్కలు మాత్రమే నాటడం గమనార్హం. పోలీసుశాఖ ఆరులక్షల మొక్కలు నాటాలని నిర్ణయించగా కేవలం 63 వేల మొక్కలు నాటింది. పరిశ్రమలశాఖ రెండు లక్షల మొక్కలకు 93 వేల మొక్కలు నాటించింది. ఉద్యానశాఖ రెండున్నర లక్షలకు 21వేల మొక్కలు మాత్రమే నాటారు. డీఆర్‌డీఓకు సంబంధించి వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులతో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటించాలని నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా 28.9 లక్షల మొక్కలు నాటించాలని నిర్ణయించగా దాదాపు అంటే 28.73 లక్షల మొక్కలు నాటినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. వీటిపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక దేవాదాయశాఖ ద్వారా నాలుగు లక్షల మొక్కలు నాటించాలని నిర్ణయించగా ఇప్పటివరకు 18 వేల మొక్కలు మాత్రమే నాటారు. సాంఘిక సంక్షేమశాఖ ద్వారా లక్ష మొక్కలు నాటించాలని నిర్ణయించగా ఇప్పటివరకు మూడువేల మొక్కలు నాటారు. అలాగే గిరిజన సంక్షేమశాఖ ద్వారా 50 వేల మొక్కలు నాటించాలని నిర్ణయించగా ఇప్పటి వరకు కేవలం వేయి మొక్కలే నాటారు. అలాగే బీసీ సంక్షేమశాఖ ద్వారా 50 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటివరకు కేవలం 741 మొక్కలు నాటారు. మార్కెటింగ్ శాఖ ద్వారా రెండు లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించగా ఇప్పటి వరకు 5 వేల మొక్కలు నాటారు. జైళ్ల శాఖ ద్వారా 25 లక్షలు మొక్కలు నాటాలని నిర్ణయించగా ఇప్పటి వరకు ఒక్క మొక్క నాటలేదు. ఆర్టీసీ ద్వారా 50 వేల మొక్కలు నాటాలని నిర్ణయించగా ఇప్పటివరకు కేవలం 815 మొక్కలు నాటారు. గనులశాఖ 20 వేల మొక్కలు నాటాలని నిర్ణయించగా దాదాపు లక్ష్యాన్ని చేరుకుంది. బుధవారం వరకు 19175 మొక్కలు నాటింది. పౌర సరఫరాల శాఖ లక్ష మొక్కలు నాటించాలని నిర్ణయించగా 5 వేల మొక్కలు మాత్రమే నాటించింది. ఇతర ప్రభుత్వ, ప్రైవేటుశాఖలతో పాటు ఐటీ పార్కులు, పారిశ్రామిక వాడల్లో 11.46 లక్షల మొక్కలు నాటించాలని నిర్ణయించగా ఇప్పటి వరకు కేవలం 1119 మొక్కలు మాత్రమే నాటారు. అంటే కేవలం ఒక శాతం మొక్కలు మాత్రమే ఇప్పటి వరకు నాటారు.



హరితహారం మొక్కలు(ఫైల్‌ఫొటో)

హరిత సైన్యాలు ఎక్కడా?

హరితహారం కింద మొక్కల నాటడంతో పాటు వాటి సంరక్షణ కోసం గ్రామ స్థాయిలో గ్రీన్ బ్రిగేడియర్లు (హరిత సైన్యాలు) ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో జిల్లాలోనూ బ్రిగేడియర్ల ఏర్పాటు మొదలు పెట్టారు. కానీ ఇవి పూర్తిస్థాయిలో ఇక్కడ ఇంకా ఏర్పాటు కాలేదు. రంగారెడ్డి జిల్లా కంటే చిన్న జిల్లాలైన జగిత్యాల, నిజమాబాద్ జిల్లాల్లో దాదాపు 1800 బ్రిగేడియర్లు ఏర్పాటు చేసి సుమారు 40 వేల మంది సభ్యులను చేర్చారు. అయితే ఇక్కడ మాత్రం కేవలం 674 బ్రిగేడియర్లను ఏర్పాటు చేశారు. ఇందులో 4249 మంది మాత్రమే సభ్యులు ఉన్నారు.

రుబెల్లా టీకా సిద్ధం..



ఐదు వారాల పాటు కార్యక్రమం
7 లక్షల మంది చిన్నారులకు వేయటమే లక్ష్యం
ఒకే టీకాతో రెండు వ్యాధుల నివారణ
9 నెల శిశువు నుంచి
15 ఏళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్)

జిల్లాలో నేటి నుంచి రుబెల్లా టీకాలు వేయనున్నారు. ఐదు వారాలపాటు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. 9 నెలల శిశువు నుంచి 15 ఏళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరి టీకాలు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 7,06,815 మంది పిల్లలకు టీకాలు వేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. వీరిలో 9 నెలల నుంచి ఏడాదిలోపు శిశువులు 7,068 మంది ఉన్నారు. అలాగే ఏడాది నుంచి మూడేళ్ల లోపు పిల్లలు 96,532 మంది ఉండగా మూడేళ్ల నుంచి ఐదేళ్లలోపు పిల్లలు 99,131 మంది ఉన్నారు. ఐదు నుంచి 15 ఏళ్లలోపు బాలబాలికలు 5,04,084 ఉంటారు. వీరందరికి తప్పనిసరిగా రుబెల్లా టీకా వేసేలా ప్రణాళిక రూపొందించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు 2,709 ఉన్నాయి. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు 1,765 ఉండగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 32 ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు 233 ఉన్నాయి. జిల్లా మొత్తంలో ఒక పరిమిత కాలవ్యవధిలో ఎంఆర్ టీకాను 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు చిన్నారులందరికీ వేయనున్నారు. గతంలో వ్యాక్సినేషన్ పొందిన వారికీ, పొందని చిన్నారులకూ ఈ టీకా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అన్ని పాఠశాలల్లో, కమ్యూనిటీ బడుల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో టీకాను వేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 250 మంది పిల్లలను కలుపుకుని ఒక యూనిట్‌గా చేస్తూ టీకా వేస్తున్నారు. పాఠశాలలో ఎంత మంది పిల్లలు ఉన్నా ఒకే రోజు ఈ టీకాలు వేసేలా వైద్య ఆరోగ్యశాఖ ముందుకు సాగుతోంది. ఇటుక బట్టీలు, సంచార జాతులు ఉన్నచోట 382 మంది పిల్లలను గుర్తించి 4 యూనిట్లుగా ఎంపిక చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వాక్సిన్‌ను సరఫరా చేశారు. ఐదు వారాల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో మొదటి రెండు వారాల్లో పూర్తిగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లోనే టీకా వేయనున్నారు. మిగిలిన రెండు వారాల్లో అంగన్‌వాడీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాల్లో టీకా ప్రక్రియ కొనసాగనున్నది. మిగిలిపోయిన పిల్లలు ఎవరైనా ఉంటే... ఐదో వారంలో టీకాలు వేసేందుకు చర్యలు తీసుకొంటున్నారు. గతంలో ఎంఆర్ టీకా వేసుకున్నా.. సరే తిరిగి టీకా పొందాలని వైద్యులు చెబుతున్నారు. అనుకోకుండా రుబెల్లా వికటిస్తే.. మెరుగైన వైద్యం అందించేందుకు 40 టీంలను ఏర్పాటు చేశారు. సంబంధించిన మందుల కిట్‌ను సిద్ధం చేశారు. జిల్లాలోని ఐదు మెడికల్ కళాశాలలతో కలుపుని హైటెక్నికల్ టీంలను ఏర్పాటు చేశారు. అందులో అత్యవసర సేవలను అందించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు.



పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

కాప్రా: జిల్లా పరిషత్ హైస్కూల్ 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన 10 మంది పేద విద్యార్థులకు లిటిల్ ఫ్లవర్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్ డైరెక్టర్ లక్ష్మీ మానస బుధవారం స్కాలర్‌షిప్‌లను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతి యేటా స్కాలర్‌షిప్‌లను ఇవ్వనున్నామని ఆమె పేర్కొన్నారు.

పంచాయతీ కార్మికుల మెరుపు సమ్మె

ఘట్‌కేసర్: మండలంలోని ఘణాపూర్ పంచాయతీ కార్మికులు బుధవారం మెరుపు సమ్మెకు దిగారు. పంచాయతీలో కొన్ని సంవత్సరాలుగా వేతనాలు పెంచకపోవడంతో పాటు సబ్బులు, నూనెలకు సంబందించి నగదు ఇవ్వడం లేదని కార్మికులు ఆందోళనకు దిగారు. ఇటీవల ఈ విషయమై పంచాయతీ కార్మికులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. అప్పట్లో స్పందించిన సర్పంచ్ వేతనాల పెంపుకు కృషిచేస్తామని హామి ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అయినప్పటికి పెరిగిన జీతాలు గాని నూనెలు, సబ్బులు డబ్బులు ఇవ్వడం లేదని నిరసిస్తూ కార్మికులు పనులను నిలిపివేశారు.

కాంగ్రెస్‌లో చేరిన టీఆర్ఎస్ కార్యకర్తలు



కెఎల్ఆర్‌తో కాంగ్రెస్‌లో చేరిన మైనారిటీ నాయకులు

ఘట్‌కేసర్: మండల టీఆర్ఎస్ నాయకుడు ఎం.ఎ.రహమాన్ తన అనుచరులతో కలిసి మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం కెల్లాఆర్ నివాసంలో రహమాన్ 30 మంది అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కెఎల్ఆర్ మాట్లాడుతూ టీఅర్ఎస్ అధికారంలోకి వచ్చిన కొత్తలో కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరారని అనంతరం అక్కడి పరిస్థితులు నచ్చక మైనారిటీలకు పార్టీలో సరైనా ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో అనేకమంది తిరిగి సొంత పార్టీ బాట పట్టారని గుర్తుచేశారు. కాంగ్రెస్ మైనారిటీలకు పెద్దపీట వేస్తూ మైనారిటీల సంక్షేమానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఎండి.ముక్తార్, ఖాజామోహినుద్దీన్, అక్బర్, తహేర్, కమర్, మగ్బుల్, సమీవుద్దీన్ ఉన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, నియోజకవర్గ నాయకుడు ఎం.ఎ.కయ్యూం, ప్రభాకర్, నరేందర్, గుర్జకుంట్ల నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్ నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు

ఘట్‌కేసర్: మండలంలోని ఎన్ఎఫ్‌సినగర్ పంచాయతీ అనుబంధ గ్రామమైన బొక్కొనిగూడ గ్రామంలో నిర్మించిన హెచ్ఎండీఏ లేఅవుట్‌పై ఫిర్యాదులు అందడంతో బుధవారం హెచ్ఎండీఏ అధికారులు నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సర్వే నెంబర్లు 324 పార్టు, 352 పార్టు, 361 పార్టు, 362 పార్టులలో ఒక ఎకరా 34 గంటలలో హెచ్ఎండీఏ లేఅవుట్‌ను రూపొందించేందుకు బొక్క సురేందర్‌రెడ్డి హెచ్ఎండీఏకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో బాగంగా ఎల్‌పి నెంబర్ 95 ఇచ్చారు. దీంతో సదరు లేఅవుట్ నిర్వాహకుడు సురేందర్‌రెడ్డి దాదాపు 85 శాతం పనులు పూర్తి చేశారు. లేఅవుట్‌లో పలు అక్రమాలు జరిగాయని ఫిర్యాదు చేశారు. దీంతో హెచ్ఎండీఏ అధికారులు స్పందించి డ్రాప్ట లేఅవుట్ వచ్చినప్పటికి నాల అక్రమణ జరగడంతో పాటు జాయింట్ పట్టదారుల నుంచి నిరభ్యంతర పత్రం లేకపోవడం ఆంజనేయస్వామి దేవాలయానికి దారి చూపించకపోవడం వంటి తప్పులు ఉన్నాయని అధికారులు గుర్తించి షోకాజ్ నోటీసులు జారీచేశారు. వెంటనే స్పందించి సరైన చర్యలు చేపట్టకపోతే ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరించాలని షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కీసర: నాగారం, రాంపల్లి గ్రామాలల్లోని పలు కాలనీలల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శ్రీకాంత్ బుధవారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. నాగారం గ్రామంలోని శిల్ప నగర్ సబ్ స్టేషన్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా నాగారం ఎస్సీ కాలనీ, వెంకట్‌రెడ్డి,బౌద్దనగర్, సత్యనారాయణ, శ్రీనివాస్ నగర్, రాంపల్లిలోని ఆర్ఎల్ నగర్, ఆర్‌టిసి కాలనీలలో 11 కేవి మరమ్మత్తుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆయన ఏఈ శ్రీకాంత్ తెలిపారు.

ఇష్టానుసారంగా రోడ్లపై పార్కింగ్..

● పట్టించుకోని అధికారులు

కీసర: రోడ్లపైన ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. దీంతో వాహనదారులు, పాదచారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్న సంబంధిత అధికారులు, పాలకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళితె మండల పరిధిలోని కీసర, నాగారం, దమ్మాయిగూడ గ్రామంలోని ప్రధాన చౌరస్తా ఇరువైపుల వాహనాదారులు యదేచ్ఛగా రోడ్లపై పార్కింగ్ చేస్తుండటంతో ఆయా గ్రామాలల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన చౌరస్తాలో గల దుకాణాల సముదాయల ఎదుట వాహనదారులు గంటల తరబడి ప్రధాన రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో రోడ్లపై పాదచారులు నడవలేని పరిస్థితి నెలకొంటుందని ప్రజలు అసహహనం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం కళాశాలలకు, పాఠశాలలకు, రాకపోకలు సాగించే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో బస్టాప్‌లో బస్సుల కోసం వేచి ఉంటున్నారు. ఈ సమయంలోనే ఆటోలు, దిచక్ర వాహనాలు, కార్లు ఇరువైపుల పార్కింగ్ చేస్తుండటంలో బస్సు డ్రైవర్లు బస్సు ఎక్కడ నిలపాలో తెలియని పరిస్థితి నెలకొంటుందని విద్యార్థులు, ఉద్యోగస్థులు వాపోతున్నారు. కాగా ఆయా గ్రామాలల్లో రోడ్డుపై జరిగే సంత వల్ల సమస్య వర్ణనాతీతం అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాని సంబంధిత అధికారులు, పాలకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు జిల్లా అధికారులు కీసర ప్రధాన చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేసిన, కీసరను టెంపుల్ టౌన్‌గా తీర్చిదిద్దాలని ముందుకు సాగాతుంటే సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేసే వారిపై చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కీసరగుట్టపై మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో నాగారం నుంచి కీసర వరకు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా హడావిడి చేసే అధికారులు, మిగతా సమయంలో కూడా ట్రాఫిక్‌కు అంతరాయం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.



కీసర ప్రధాన చౌరస్తా వద్ద పార్కింగ్ చేసిన వాహనాలు

చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి



కీసరలోని ప్రధాన రహదారిపై వాహనదారులు ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారు. రోడ్లపై పార్కింగ్ చేస్తున్న వాహనాలతో పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుకాణాల ఎదుట వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో వినియోగదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఉదయం సాయంత్రం వేళ రోడ్లపై పార్కింగ్ చేసే వాహనాదారులపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలి.

- ఆన్వర్, గ్రామస్థుడు, కీసర

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం..



నాగారంలోని ప్రధాన రహదారులపై వాహనాదారులు ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దమ్మాయిగూడ చౌరస్తా వద్ద ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఈస్ట్ గాంధీనగర్ కాలనీ సాయిబాబా ఆలయం వద్ద లారీలు ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తుండటంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు ప్రజల సమస్యను గుర్తించి రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలి.

- ఆంజనేయులు గౌడ్, గ్రామస్థుడు, నాగారం

మీజిల్స్, రుబెల్లాను తరిమికొట్టడానికి ఒకే ఒక టీకా

● జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఉపవైద్యాధికారి నారాయణ రావు

ఘట్‌కేసర్: ప్రాణాంతకమైన మిజిల్స్, రుబెల్లాను తరిమికొట్టడానికి ప్రతిఒక్కరి భాగస్వామ్యం అవసరమని జిల్లా వైద్యాఆరోగ్య శాఖ ఉపవైద్యాధికారి నారాయణరావు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా యేటా దాదాపు 40 వేల పైచిలుకు మిజిల్స్, రుబెల్లా వ్యాదితో మరణిస్తున్నారన్నారు. ఇతర దేశాలతో పోల్చితే 37వ శాతంలో మనదేశం ఉందన్నారు. మిజిల్స్, రెబెల్లా వ్యాధులను అంతమొందించడానికి ఒకే ఒక టీకా సరిపోతుందని గుర్తు చేశారు. రెండు వ్యాధులను నివారిచేందుకు ఇచ్చే ఒకే టీకాను నేటి నుంచి 8 రాష్ట్రాలలో అమలు చేస్తున్నట్లు వివరించారు. గతంలో 5 రాష్ట్రాలలో టీకా ఇచ్చి విజయం సాధించినట్లు పేర్కొన్నారు. మండలంలో 64,417 మంది 9 నెలల నుంచి 17 సంవత్సరాలు ఉన్న వారికి టీకా వేయనున్నట్లు తెలియజేశారు. మండలంలో 61 ప్రభుత్వ పాఠశాలలో, 219 ప్రైవేటు పాఠశాలలు ఉండగా రెండు వారాల పాటు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి మిజిల్స్, రుబెల్లా టీకాలు వేయనున్నట్లు తెలిపారు. మేడ్చల్ డివిజన్‌లో 3 లక్షల 54 వేల 216 మందికి టీకా వేసేందుకు కసరత్తు చేశామన్నారు. టీకాల పంపిణిలో ఎలాంటి అపోహలకు అవకాశం లేదన్నారు. అనేక దేశాలలో నడుస్తున్న కార్యక్రమామేనని గుర్తు చేశారు. ముందుగా ప్రజలలో ఉన్న అపోహల్ని పోగొట్టేందుకు రెండు, మూడు పాఠశాలలను ఎంచుకుని వారి వద్ద వైద్యబృందాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుని కార్యక్రమాన్ని వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయంపై ఇప్పటికే ఉపాధ్యాయులకు, అంగన్‌వాడి, ఆశా, ఎఎన్ఎంలకు ప్రత్యేక శిక్షణలు ఇచ్చి సిద్దంగా ఉంచమన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విద్యాబోధకుడు విపూరి రవికుమార్, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

హరితహారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

ఘట్‌కేసర్: హరితహారం కార్యక్రమంలో పంచాయతీలకు నిర్దేంచిన మొక్కల్ని నాటడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో శోభ హెచ్చరించారు. మండలపరిషత్ కార్యాలయంలో బుధవా రం ఏర్పాటుచేసిన హరితహారం సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీకి 40వేల చొప్పున మండ ల వ్యాప్తంగా 6 లక్షల 40వేల మొక్కలను నాటాలని నిర్దేంచినప్పటికి చాలా పంచాయతీలలో లక్ష్యానికి దూరంగా ఉన్నాయని ఇప్పటి వరకు 50 శాతమైన పూర్తి చేయకపోవడం విచారకరమన్నారు. అన్ని పంచాయతీలు విధిగా 40 వేల మొక్కలు నాటాలని ఆదేశించారు. ముఖ్యంగా బిల్‌కలెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు మొక్కలు నాటడానికి చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటి వరకు నాటిన మొక్కల సంరక్షణకు చర్య లు తీసుకోవడంతో పాటు కొత్త మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటే క్రమంలో మొక్కలకు అడుగున ఎరువు వేయడంతో పాటు వెంటనే కంచె నాటాలన్నారు. ఎప్పుడైన ఉన్నతాధికారు లు సందర్శించి తనిఖీలు చేసే అవకాశం ఉన్నందు న మొక్కల పెంపకంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజేశ్వర్‌రెడ్డి, ఈవోపీఅర్డీ సునంద, పంచాయతీ కార్యదర్శులు, బిల్‌కలెక్టర్లు పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని కలెక్టర్‌కు ఫిర్యాదు

ఘట్‌కేసర్: మండలంలోని చౌదరిగూడ పంచాయతీ పరిధిలో గల ఓయూ కాలనీలో రోడ్డు స్థలంను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని పంచాయతీ పాలకవర్గం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 751, 752 లలో గల ఓయూ కాలనిలో ప్రధాన దారిలో 160 బై ఎ, 166 బై ఎ ప్లాట్ల నెంబర్లు వేసి దాదాపు 400 గజాల రోడ్డు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన సర్పంచ్‌గాని కార్యదర్శిగాని ఏమాత్రం పట్టించుకోలేదని, రోడ్డు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వల్ల భవిషత్తులో కాలనీకి వెళ్ళడానికి ఇబ్బంది తలెత్తే ప్రమాదముందని, ఈ విషయమై చోద్యం చూస్తున్న సర్పంచ్, కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ఉపసర్పంచ్ భైరు లక్ష్మన్‌గౌడ్, పంచాయతీ సభ్యులు కొంగరి శంకర్‌గౌడ్, పద్మావతి, దుర్గారెడ్డి, పద్మమ్మ, బండ్లగూడ వాణి, బి. శ్రీనివాస్, సంయుక్తాలు తదితరులు పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సలే 'విజన్' లక్ష్యం

- లయన్స్‌క్లబ్ సహకారంతో వైద్య పరీక్షలు
- రూ.30ల కన్సల్టెన్స్ ఫీజు
- తాండూరులో ఉచిత కంటి ఆస్పత్రి ఏర్పాటుకు యోచన

తాండూరు : దృష్టిలోపం, కంటి సమస్యలతో బాధపడుతున్న పేద వర్గాలకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయడం లక్ష్యంగా విజన్ సెంటర్ పనిచేస్తుంది. సాధారణ కన్సల్టెన్స్ ఫీజు రూ.30లతోనే కంటి పరీక్షలు నిర్వహించి తదనంతరం కంటి శస్త్ర చికిత్సలు అవసరమైతే ఉచితంగా జరిపిస్తున్నారు. తాండూరులో లయన్స్‌క్లబ్ సహకారంతో ఏర్పాటుచేసిన విజన్ సెంటర్ పేరుతో నిరుపేదలకు ప్రయోజనం కలుగుతుంది. హైదరాబాద్ సాధురాం ఆస్పత్రి వైద్యుల సహకారంతో తాండూరు లయన్స్‌క్లబ్ శాఖ జూన్ 17న తాండూరులో విజన్ సెంటర్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించారు. ప్రతి సోమవారం సాధురాం ఆస్పత్రి నుంచి కంటి వైద్య నిపుణులతోపాటు నలుగురు వైద్య సిబ్బంది తాండూరు విజన్ సెంటర్‌కువచ్చి కంటి పరీక్షలు చేస్తున్నారు. కంటి శస్త్ర చికిత్సలు అవసరమున్నవారిని గుర్తించి అదేరోజు లయన్స్‌క్లబ్ సహకారంతో ఉచిత రవాణా, భోజన సౌకర్యాలను పేషంట్‌కు కల్పించి రూ.25వేల వ్యయం కాగల శస్త్ర చికిత్సలను ఉచితంగా చేయిస్తున్నారు. శస్త్ర చికిత్స అనంతరం రెండు రోజులకు పేషంట్లను తిరిగి ఇంటికి పంపిస్తారు. ఈ సెంటర్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 320 మంది ఔట్ పేషంట్లను పరిశీలించి 72మందికి ఉచితంగా శస్త్ర చికిత్సలు జరిపించారు. గతంలో లయన్స్ క్లబ్ నెలలో ఒకసారి కంటి ఉచిత వైద్య శిబిరాలను ఈ ప్రాంతంలో ఏర్పాటుచేసి అవసరమైనవారికి శస్త్ర చికిత్సల నిమిత్తం హైదరాబాద్‌కు తరలించేవారు. లయన్స్‌క్లబ్ సహకారంతో విజన్ సెంటర్ ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం ప్రతి సోమవారం తాండూరు విజన్ సెంటర్‌లో కంటి పరీక్షలు జరుపుతున్నారు. శాశ్వతంగా సెంటర్‌ను ఏర్పాటు చేసే విషయమై లయన్స్‌క్లబ్, సాధురాం ఆస్పత్రి వారు పరిశీలిస్తున్నారు. ఇక్కడ సెంటర్ ఏర్పాటుచేస్తే వికారాబాద్ జిల్లాతోపాటు మహబూబ్‌నగర్ జిల్లా, సంగారెడ్డి జిల్లాకు చెందినవారు, కర్ణాటక ప్రాంతానికి చెందిన చించొళి, గుర్మిట్కల్ ప్రాంతాల కంటి రోగులకు ఉపయోగపడే అవకాశం ఉంది. కంటికి పొరలను సోకి హైదరాబాద్‌కు వెళ్లి చికిత్స చేసుకున్న వృద్ధులు చాలామంది ఉన్నారు. వారి సౌకర్యం కోసం తాండూరులో సెంటర్ ఏర్పాటుచేయడం ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. తాండూరులో ఈ విజన్ సెంటర్ ఏర్పాటుకు లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ వెంకటాచలం కృషి ఎంతో ఉంది.



విజన్ సెంటర్‌కు కంటి పరీక్షల కోసం వచ్చిన రోగులు


వైద్య పరీక్షలు చేస్తున్న సాధురాం ఆస్పత్రి వైద్యులు

శాశ్వత సెంటర్ కోసం ప్రయత్నిస్తున్నాం..



ఈ ప్రాంతంలో కంటి రోగులు అధికంగా ఉన్నారని గుర్తించాము. లయన్స్‌క్లబ్ నేత్ర దానం విషయంలో ప్రత్యేక చొరవ చూపిస్తుంది. అందులో భాగంగానే నిరుపేద కుటుంబాలకు చెందిన దృష్టిలోపం, కంటి సమస్యలతో బాధపడుతున్నవారికి పరీక్షలతోపాటు ఆపరేషన్ చేయించాలని లయన్స్ క్లబ్ నిర్ణయించింది. ఈమేరకు తాండూరులో శాశ్వత సెంటర్ కోసం ప్రయత్నిస్తున్నాము. ఈ విషయాన్ని మంత్రి మహేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాము.

- భద్రన్న, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు

ప్రజల్లో చైతన్యం తెస్తున్నాం..



కంటి సమస్యలతో బాధపడుతున్న రోగులను గుర్తించి చైతన్యం తెస్తున్నాము. గ్రామాల్లో చాటింపు చేసి ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నాము. ఈ ప్రాంతంలో కంటి సమస్యలతో బాధపడకుండా ప్రతి ఒక్కరూ ఉండాలని భావిస్తున్నాము. ఉచిత సేవలను అందించడంలో లయన్స్‌క్లబ్ అధిక ప్రాధాన్యత ఇస్తుంది.

- వినోద్‌కుమార్‌జైన్, విజన్ సెంటర్ కో-చైర్మన్

కంటి పరీక్షల వివరాలిలా..

విజన్ సెంటర్ ప్రారంభం తర్వాత జూన్ 17న 15 మందికి, జూలై 3న 12 మందికి, 10న 15 మందికి, 17న 18 మందికి, 24న 9 మందికి, 31న 14 మందికి, ఆగస్టు 7న 9 మందికి కంటి శస్త్ర చికిత్సలు సాధురాం ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు.

ట్రా'ఫికర్'

- షాద్‌నగర్ ముఖ్యకూడలిలో అడ్డగోలుగా ప్రైవేట్ వాహనాల పార్కింగ్
- నష్టపోతున్న ఆర్టీసీ
- రోజురోజుకు పెరుగుతున్న ఫుట్‌పాత్ వ్యాపారం
- ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు, ప్రజలు

షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ ముఖ్యకూడలి మొత్తం ట్రాఫిక్ జాంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 44వ జాతీయ రహదారి, ముంబై బైపాస్ రహదారి కావడంతో నిత్యం వచ్చే భారీ వాహనాలతో ముఖ్యకూడలి మొత్తం ట్రాఫిక్‌కు కారణమవుతుంది. పరిగి రోడ్డు, హైదరాబాద్, మహబూబ్‌నగర్ వైపు వెళ్లే రహదారుల పక్కన ఫుట్‌పాత్ వ్యాపారం, ప్రైవేటు వాహనదారులు రోడ్డుపైనే తమ వాహనాలు నిలుపుతుండటంతో మరింత ట్రాఫిక్ సమస్యకు కారణమవుతుందని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.

మహబూబ్‌నగర్, జడ్చర్ల రోడ్డు వైపు ఇలా..

షాద్‌నగర్ ముఖ్యకూడలి నుంచి మహబూబ్‌నగర్, జడ్చర్ల వైపు వెళ్లే ట్రాఫిక్ సిగ్నల్ వద్దనుంచే వాహనచోదకులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యకూడలి నుంచి వెంకటేశ్వర థియేటర్ వరకు ఉన్న వ్యాపార దుకాణాల ఎదుట నిలిపే వాహనాలు, ఫుట్‌పాత్ వ్యాపారులు, ప్రైవేటు వాహనదారులు రోడ్డుపైనే తమ వాహనాలు నిలుపుతుండటంతో ట్రాఫిక్‌కు కారణమవుతుంది. ఇక్కడే హోటళ్లు, మొబైల్ సెంటర్లు, వైన్స్‌లు, బార్లు ఉండటంతో గంటల తరబడి రోడ్డుపై తమ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఇక ప్రైవేటు వాహనదారులు ప్రయాణీకుల కోసం రోడ్డుపై నిలపడంతో ఇతర వాహనాలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్టీసీ బస్సులకు సైతం స్థలం ఇవ్వకుండా ప్రైవేటు వాహనదారులు బస్సులు తొందరగా వెళ్లేలా ట్రాఫిక్‌ను సృష్టిస్తున్నారు.



షాద్‌నగర్ ముఖ్యకూడలి

పరిగి రోడ్డులో..

షాద్‌నగర్ పట్టణంలోని పరిగి రోడ్డులో ఉన్న చిన్నపాటి స్థలంలో ఆటోలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. రోజురోజుకు ఫుట్‌పాత్ వ్యాపారులు పెరిగిపోవడంతో ట్రాఫిక్ సమస్యకు కారణమవుతోంది. బస్టాండ్ ఎదురుగా నిలిపిన ఆటోలు షాబాద్, చేవెళ్ల, కొందుర్గు, పరిగి తదితర గ్రామాలకు ప్రయాణీలను చేరవేస్తుంటారు. ప్రయాణీకులను ఎక్కించుకునే క్రమంలో పోటీపడి ఆటోలను రోడ్డుపైనే నిలపడం, అక్కడే ఉన్న వివిధ దుకాణాలు, ఆసుపత్రులకు వచ్చే వాహనచోదకులు కూడా రోడ్డుపైనే తమ వాహనాలను పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇదే క్రమంలో బస్టాండ్‌లోకి బస్సులు ఒకే రహదారి గుండా వచ్చి వెళ్తుండటం, ముంబాయి బైపాస్ రోడ్డు కావడంతో రవాణా సరకులు తీసుకువచ్చే భారీ వాహనాలు ట్రాఫిక్ జాంతో ఇబ్బందులకు గురవుతున్నాయి. పరిగి రోడ్డులోని ఇతర కాలనీలకు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంటోంది. రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలిపే ఆటోలపై, దుకాణాల ముందు క్రమపద్ధతిలో నిలుపని వాహనాలపై చర్యలు తీసుకుని ట్రాఫిక్ సమస్య పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

హైదరాబాద్‌వైపు ఇలా...

శంషాబాద్, కొత్తూర్ వైపు నుంచి వచ్చిన ప్రైవేటు వాహనదారులు ముఖ్యకూడలిలో హైదరాబాద్ వైపు యూటర్న్ తీసుకుంటూ అక్కడే ప్రయాణీకులను ఎక్కించుకుంటున్నారు. పరిగి రోడ్డు వైపు నుంచి వచ్చిన వాహనాలకు ముందుకు వెళ్లేందుకు స్థలం లేకపోవడంతో ట్రాఫిక్‌కు కారణమవుతుంది. ఆదివారం సంతకావడంతో సిగ్నల్ పడినప్పటినుంచే రోడ్డు మధ్యలోనే ప్రయాణీకులను ఎక్కించుకుంటూ ట్రాఫిక్‌కు కారణమవుతున్నారు. ఇక్కడి నుంచి ఇంకాస్త ముందుకు వెళితే ఇతర కాలనీలకు వెళ్లే రోడ్డు వద్ద ప్రైవేటు వాహనాలు నిలిపి కాలనీలకు వెళ్లేవారికి సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇదేమిటని కాలనీవాసులు ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తిస్తున్నారని ప్రజలు పేర్కొన్నారు. సంబంధిత పోలీస్‌శాఖ అధికారులు ట్రాఫిక్‌జాంకు కారణమవుతున్న అంశాలను దృష్టిలో పెట్టుకుని సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


పరిగి రోడ్డులో బస్టాండ్ ఎదురుగా నిలిపిన ఆటోలు

దీనిని ధరించకపోతే..

హెల్.. మెట్.!

చేవెళ్ల రూరల్ : హెల్మెట్ దీని అర్థం..! శిరస్త్రాణం..! అంతరార్థం.. నరకానికి వెళ్లినట్టే..! అర్థమవలేదా.... ఇంగ్లీష్‌లో హెల్... అంటే నరకం... మెట్ అంటే కలుసుకున్నారు..!! మరింత విపులంగా చెప్పాలంటే... ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట ద్విచక్ర వాహన ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. తలకు తీవ్రగాయాలతో అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారు. వారు హెల్మెట్ ధరిస్తే తలకు తీవ్ర గాయాలయ్యేవికావు. ప్రాణాపాయం ఉండేది కాదు. శిరస్త్రాణం ధరించకుండా ప్రాణాన్ని మూల్యంగా చెల్లించనందుకు వీరికి స్వర్గప్రాప్తి తలకు మూసుకుపోతాయి. కన్న పేగును, కట్టుకున్న భార్యను, కన్న పిల్లలను, ఇలా అందిరినీ ఆగమాగం చేసి వెళ్లినందుకు వీరికి నరక ద్వారం తెరుచుకుంటుంది. ప్రాణాపాయం లేకపోయినా తలకు తగిలిన త్రీవగాయాలతో చిరకాలం నరకం అనుభవిస్తారు. ఇలాంటి ప్రమాదాలనుంచి తప్పించుకునేందుకుగాను ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని పోలీసులు సూచిస్తున్నారు.




చిన్నతప్పు.. పెద్ద శిక్ష

హెల్మెట్ ధరించకపోవడమన్న ఒకే ఒక చిన్న తప్పు ఎందరివో నిండు ప్రాణాలను బలిగొంటోంది. వారి తల్లిదండ్రులకు గర్భశోకాన్ని మిగులుస్తోంది. తమపై ఆధారపడిన భార్యాబిడ్డల బతుకులను భవితను ఆగమాగం చేస్తోంది. శిరస్త్రాణం కాపాడే ప్రాణం అంటూ ట్రాఫిక్ పోలీసులు నెత్తీనోరు కొట్టుకుని చెబుతున్నా కూడా కొందరు ద్విచక్రవాహన చోదకులు చెవికెక్కడం లేదని వాపోతున్నారు.

హెల్‌మెట్‌కు దూరంగా ఉండండి..

ఒక్కసారి తలెత్తి అలా రోడ్డు చూడండి. నెత్తిపై హెల్మెట్ లేకుండా ఎంతమంది ద్విచక్ర వాహన చోదకులు వెళ్తున్నారో లెక్కించండి.. వారిలో ఒకరుగా మీరు ఉండకండి హెల్మెట్ ధరించాలని పోలీసులు సూచిస్తున్నారు. ద్విచక్రవాహనంపై వెళ్తున్నప్పుడు కొందరు హెల్మెట్‌ను తలకు పెట్టుకోకుండా వాహనం ముందు పెట్టుకుంటుంటారు. ప్రమాదం జరిగితే తలకు గాయాలయ్యే అవకాశం ఉందని పోలీసులు వివరిస్తున్నారు.

బరువు కాదు... భద్రత, భాధ్యత



తలపై హెల్మెట్ పెట్టుకోవడానికి అనేకమంది బరువుగా భావిస్తున్నారు. కానీ అది మన భద్రత కోసమని దానిని ధరించడం బాధ్య తని గుర్తించడం లేదు. మేం ఎంతగా చెబుతున్నా అనేక మంది వినడం లేదు. కేసులు నమోదుచేసి జరిమానా విధిస్తేనన్నా మార్పు వస్తుందేమోనని ఆ పని కూడా చేస్తున్నాం. ఫలితం శూన్యం, మీ ప్రాణం మీ ఒక్కరిదే కాదు.. మీ అమ్మానాన్నది. మీ భార్యాపిల్లలది. మీ ఆత్మీయులది. ప్రమాదంలో మీకేమైనా జరగరానిది జరిగితే మీరందరూ ఎంతగా బాధపడతారో ఒక్కసారి ఆలోచించండి..!!

- గురువయ్య, చేవెళ్ల, సీఐ

అప్పుల ఊబిలో పౌల్ట్రీ రైతులు

మైగ్రేషన్ పేరిట నిలువుదోపిడీ
కంపెనీలు ఆడిందే ఆట
ఏడాదికి నాలుగు బ్యాచ్‌లు
కూడా రాని వైనం
బ్యాంకు కిస్తులూ కట్టలేని దుస్థితి
భూములు అమ్ముకుని
అప్పులు తీర్చే పరిస్థితి


బ్రాయిలర్ ఫౌల్ట్రీఫాంలో కోళ్ల పెంపకం

మంచాల : వ్యవసాయ అనుబంధ రంగంగా పాడిగేదెల పెంపకం కొనసాగుతూ వచ్చింది. రైతులు తమ పొలంలో పంటలకు తోడు కొద్దిగా పశుగ్రాసం పెంచుకుని డైరీతో ఉపాధి పొందేవారు. కాగా ఇటీవలి కాలంలో పౌల్ట్రీ పరిశ్రమపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. పాడిగేదెల కంటే కోళ్లపెంపకం కొంచెం డిగ్నిటీగా కనిపించడంతో రైతులు పౌల్ట్రీవైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా పౌల్ట్రీఫాంలు దర్శనమిస్తున్నాయి. కొద్దిపాటి వ్యవసాయ భూమి ఉన్న రైతులందరూ తమ పొలంలో కోళ్ల షెడ్ వేసుకుని జీవనం సాగిస్తున్నారు. 10 వేల బ్రాయిలర్ కోళ్లు పెంచే ఫాం నిర్మాణానికి సుమారు 14 లక్షల దాకా ఖర్చు అవుతోంది. తమ దగ్గర అంతభారీ మొత్తంలో పెట్టుబడి లేకపోవడంతో రైతులు అప్పుకోసం సమీపంలోని బ్యాంకులను ఆశ్రయిస్తున్నారు. దీంతో బ్యాంకర్లు వ్యవసాయ పొలాలను తాకట్టు పెట్టుకుని పౌల్ట్రీషెడ్ నిర్మాణం కోసం రైతులకు అప్పులు ఇస్తున్నారు. ఇలా ఒక్క మంచాల మండలంలోనే 20 లక్షల కెపాసిటీ గల బ్రాయిలర్ కోళ్ల ఫాంలు ఏర్పాటు చేయబడ్డాయి. వీటిలో 90శాతం పౌల్ట్రీషెడ్‌లు బ్యాంకు రుణాలతో నిర్మించినవి కావడం విశేషం..

మైగ్రేషన్ పేరిట
పౌల్ట్రీ కంపెనీల పెత్తనం..

పౌల్ట్రీఫాంలకు పేరుకే రైతులు యజమానులు. చేసేది మాత్రం కూలీ పని కాగా పెత్తనమంత పౌల్ట్రీ కంపెనీలదే.. అదెలాగంటే పౌల్ట్రీ షెడ్ నిర్మాణం పూర్తికాగానే పౌల్ట్రీకంపెనీలు ఆరంగేట్రం చేస్తాయి. కోడిపిల్లల పంపిణీ మొదలుకొని దాణా, మందులు అన్నీ కంపెనీలే సరఫరా చేస్తాయి. పెంపకం మాత్రం రైతులు చూసుకోవాలి. 45 రోజుల పాటు కోళ్లను పెంచిపోషించినందుకు రైతులకు కిలోకు 3 రూ.ల చొప్పున కూలీ చెల్లించబడుతుంది. సొంతంగా కోళ్లపెంపకం, మార్కెటింగ్ కష్టమైన పని కావడంతో పౌల్ట్రీ కంపెనీలు కోడిపిల్లలను రైతులకు చెందిన షెడ్‌లలో పెంచి 45 రోజులు కాగానే మార్కెట్‌కు తరలించి సొమ్ముచేసుకుంటారు. సొంతంగా కోళ్లు పెంచలేని రైతుల అసహాయతను ఈ కంపెనీలు సొమ్ముచేసుకుంటున్నాయి. మంచాల మండలంలో ఉన్న సుమారు 20 లక్షల బ్రాయిలర్ పౌల్ట్రీ ఫాంలలో స్నేహ కంపెనీ 70-80 శాతం వాటా కల్గిఉండగా మిగతా 20 శాతంలో వెంకటేశ్వర తదితర కంపెనీలు బ్రాయిలర్ కోళ్లను పెంచుతున్నాయి.

ఇష్టారాజ్యంగా కోడిపిల్లల పంపిణీ..

పౌల్ట్రీఫాంలో కంపెనీల వ్యవహారం ఇష్టారాజ్యంగా మారింది. మార్కెట్ ధరలకు అనుగుణంగా తము తలచినపుడే కోడిపిల్లలను పంపిణీ చేస్తూ పౌల్ట్రీ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. సాధారణంగా బ్రాయిలర్ కోళ్ల పెంపకం 45 రోజుల్లో పూర్తవుతుంది. షెడ్ సిద్ధం చేయడం కోసం పదిరోజులు కేటాయించినా మొత్తం 55 రోజుల్లో కోళ్ల పెంపకం మార్కెటింగ్ పూర్తికావాలి. అంటే సంవత్సరంలో ఒక్కో షెడ్‌లో కనీసం 6 బ్యాచ్‌లు కోళ్ల పెంపకం చేపట్టాలి. అది నిబంధన కాగా రైతుల నిస్సహాయతను ఆసరాగా చేసుకున్న పౌల్ట్రీ కంపెనీలు అన్నదాతలను తమ గుప్పిట్లో పెట్టుకుని పెత్తనం చెలాయిస్తున్నాయి. అదేమని ప్రశ్నించే ధైర్యం రైతులకు లేకుండా చేశాయి. ఏడాదిలో 3 బ్యాచ్‌లు మాత్రమే సరఫరా చేస్తూ పౌల్ట్రీ రైతుల పొట్ట గొడుతున్నారు.

ఆదాయాన్ని మించి పెంపకం ఖర్చు..
కనీసం ఖర్చులూ చేతికి రాని వైనం..

పేరుకేమో మెగ్రేషన్ కానీ పెంపకం ఖర్చులు మాత్రం పౌల్ట్రీ రైతులే మోస్తున్నారు. కేవలం దాణా సరఫరా వరకే పౌల్ట్రీ కంపెనీలు భరిస్తూ అదనపు పెట్టుబడులు మొత్తం రైతులపై మోపుతున్నారు. 10 వేల బ్రాయిలర్ కోళ్ల పెంపకానికి ఒక్కో బ్యాచ్‌కు రైతులకు 30 వేల రూ.లకు పైగా ఖర్చు వస్తోంది. ఇందులో వరిపొట్టు పరచడం, బొగ్గులతో బ్రూడింగ్, ఎర్రమట్టి, చున్నంతో అలుకు, కోడిపిల్లలకు చుక్కల మందులు వేయడం, లోడింగ్, అన్‌లోడింగ్ తదితర ఖర్చులన్నీ మిళితమై ఉంటాయి. ఇదేగాక బ్యాచ్ పెంపకానికి ఇద్దరు వ్యక్తులు శ్రమించాలి. ఇంత చేస్తే కిలోకి 3 రూ.ల చొప్పున ఒక్కోబ్యాచ్‌కు రైతులకు చేతికందేది రూ.50-70 వేలు మాత్రమే. అయితే ఇందులో ఖర్చులు పోనూ భార్యాభర్తలు కలిసి పనిచేసిన రైతులకు కనీసం కూలీ కూడా గిట్టదు.

తడిసి మోపెడవుతున్న అప్పులు..

పౌల్ట్రీ రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. తడిసి మోపెడవుతున్న అప్పులతో ఆస్తులమ్ముకునే ప్రమాదం నెలకొంది. 10 వేల సామర్థ్యం గల పౌల్ట్రీఫాం నిర్మాణానికి 14 లక్షల రూ.ల దాకా పెట్టుబడి అవుతోంది. ఈ పెట్టుబడి కోసం రైతులు తమ వ్యవసాయపొలాలను బ్యాంకులో తాకట్టు పెట్టి 5-10 లక్షల రూ.దాకా రుణం పొందుతున్నారు. మిగతా పెట్టుబడి కోసం ప్రైవేటుగా అప్పులు తెచ్చుకుంటున్నారు. మొత్తం 14 లక్షల పెట్టుబడికి 2 రూ.ల మిత్తి లెక్కించినా నెలకు 28 వేల రూ.లు అవుతోంది. అంటే ఏడాదికి పౌల్ట్రీ రైతులు 3 లక్షల 36 వేల దాకా మిత్తీలు కడుతున్నారు. పౌల్ట్రీ ద్వారా వచ్చే ఆదాయం ఖర్చులు పోనూ జీతం కూడా గిట్టడం లేదు. దీంతో బ్యాంకు కిస్తులు కూడా చెల్లించలేని దుస్థితికి అన్నదాతలు చేరుకున్నారు. ఈ తరుణంలో అప్పులు అంతకంతకూ పెరిగి కుప్పలుగా మారుతున్నాయి. ఫలితంగా ఉన్న కొద్దిపాటి ఆస్థులు పోగొట్టుకునే దుర్భర స్థితికి చేరుకున్నారు.

ప్రభుత్వం తక్షణమే స్పందించాలి..
లేదంటే ఆత్మహత్యలే..

ఇప్పటికే పౌల్ట్రీ రైతులు అప్పుల ఊబిలో చిక్కుకుపోయారు. ఏ రైతును కదిలించినా ఉపాధికోసం కోళ్లఫాం వేస్తే ఉన్న భూమే పోయేటట్టుంది అంటూ మానసిక వేదనకు గురౌతున్నారు.

పౌల్ట్రీ రైతుల నిలువుదోపిడీపై ప్రభుత్వం, సామాజిక వేత్తలు తక్షణమే స్పందించాల్సిన అవసరముంది. పౌల్ట్రీ రైతుల దుస్థితిపై సమగ్ర అధ్యయనం చేయాలి.

యుద్ధప్రాతిపదికన ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. ముందు పౌల్ట్రీ కంపెనీల దోపిడీని అరికట్టాలి. లేదంటే పౌల్ట్రీరైతుల ఆత్మహత్యల పరంపర కొనసాగే ప్రమాదం పొంచిఉంది.

కరువు మేఘం

●కలిసిరాని ఖరీఫ్ ●ఎండిపోతున్న పంటలు ●వర్షాభావంతో కోట్ల విలువ చేసే పంటలకు నష్టం
●ఊరిస్తున్న మేఘాలు...ఊగిసలాడుతున్న రైతులు


లింగంపల్లిలో ఎండుతున్న మొక్కజొన్న

పరిగి: ఒక్క వర్షం కురిస్తే రైతులకు కోట్ల లాభం జరుగుతుంది. ఎలాగంటే... గత నెల వరకు ఆశాజనకంగా ఉన్న పంటలు ప్రస్తుతం వాన జాడ కానరాకుండా పోవడంలో ఎండిపోతున్నాయి. విత్తనాలు విత్తిన నాటి నుంచి ఆడపాదడపా కురిసిన వర్షాలు ఇప్పుడు కనిపించడకుండా పోయాయి. ప్రస్తుతం చేతికొచ్చిన మొక్కజొన్న, పత్తి లాంటి పంటలకు ఒక వర్షం కురిస్తే కోట్లలో లభాం చేకూరుతుందని రైతులు చెబుతున్నారు. పెట్టుబడి పొలంపైనే ఉండిపోవడంతో రైతులకు కంటి మీద కునకులేకుండా పోయింది. కార్తులు దాటుతున్నా వర్షాలు కురియక అన్నదాతలు ఉసూరుమంటున్నారు. ఇరవై రోజుల నుంచి వర్షం జాడ లేక పోవడంతో విత్తిన పంటలన్నీ ఎండుముఖం పడుతున్నాయి. ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు బోర్ల ద్వారా నీటి సౌకర్యం ఉన్న రైతులు చేస్తున్న ప్రయత్నాలు లాభం లేకపోతున్నాయి. బోర్లలో నీళ్ళు లేకపోవడం, దానికితోడు భూగర్భజలాలు అడుగంటిపోవడంతో ఏమి చేయలేక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిగి సబ్ డివిజన్‌లో జూలై మొదటి వారంనాటికి 90 శాతం పైర్లు సాగైనట్లు చెబుతున్నారు. పరిగి వ్యవసాయ డివిజన్‌లో పంటల సాగుకు పనికి వచ్చే పొలం 36, 517 హెక్టార్లలో సాధారణ సాగుకు అనుకూలంగా ఉండగా, దాదాపు 28 వేల హెక్టార్లలో సాగు చేసినట్లు తెలుస్తున్నది. ఈ విస్తీర్ణంలో మొక్కజొన్న, పత్తి, జొన్న, వేరుశనగ, బెబ్బరులు సాగు చేశారు. ఇప్పటి వరకు సాగు చేసిన పంటలు ఎండకుండా పండితే రూ.20 కోట్ల విలువ గల పంటలు ఉంటాయని అంచనా. వీటిని కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పరిగి, దోమ, కులకచర్ల, పూడూరు మండలాల్లోని పలు గ్రామాల్లో రైతులు ఎండిపోతున్న పంటలను చూసి కన్నీరు,మున్నీరవుతున్నారు. మెట్ట పంటల పరిస్థితి ఇలా ఉంటే ఇక వరినాటుకోసం నారుమళ్ళు పోసుకున్న రైతుల పరిస్థితి వేరుగా ఉంది. బోర్లు, చెరువుల ఆధారంగా సాగుచేసుకుందామని ఎన్నో ఆశలతో నారుమళ్ళు పోసుకున్నప్పటికీ వర్షాలు కనిపించడకుండా పోవడంతో వరినారు ముదిరిపోతున్నదని రైతుల వాపోతున్నారు. చెలక నేలలు ఉన్న ప్రాంతాల్లో పైర్ల పరిస్థితి దారుణంగా ఉందని రైతులు చెబుతున్నారు. దోమ, కులకచర్ల మండలాలతోపాటు, పరిగి మండలంలోని సగం గ్రామాల్లో ఎక్కడా చూసిన రైతన్నలంతా బోరున విలపిస్తున్నారు. గ్రామాల్లో ఏ నలుగురు రైతులు ఒక చోట జతకూడినా కాలం పోయింది. చేసిన అప్పులు ఎలా తీర్చాలి, పొలాల దిక్కు వెళ్దామంటే ప్రాణం తల్లడిల్లిపోతుందని వెళ్లలేకపోతున్నామంటున్నారు. చెలక నేలలో సాగు చేసిన మొక్కజొన్న, పత్తి, వరి, రాగులు, జొన్న పైర్లు వర్షాలు లేక ఎండుముఖం పడుతున్నాయి. మరో రెండు మూడు రోజుల్లో వర్షాలు కురవకపోతే పంట మొక్కలు పూర్తి స్థాయిలో ఎండిపోయే ప్రమాదం ఉందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కమ్ముకున్న కరువు మేఘాలు..
పిక్కటిల్లుతున్న రైతులు

ఖరీఫ్ ప్రారంభంలో మెట్టపంటలకు సరిపోను వర్షాలు కురిశాయి. ఆ తర్వాత వర్షం కనిపించకుండా పోయింది. మేఘాలు కుమ్ముకుని ఊరిస్తున్నాయే తప్పా, చినుకురాల్చడం లేదు. ఈ ఏడాది ముందుగానే రుతుపవనాలు రావడంతో మృగశిర సమయంలో కురిసిన వర్షాలు ఎంతో మురిపించాయి. తీరా పంటలు చేతికోచ్చే సరికి ఆ వర్షాలు కానరాకుంగా పోయాయి. జిల్లాలో అక్కడక్కడా కురుస్తున్నా పరిగి నియోజకవర్గంలో మాత్రం వాన చినుకులు అంతంతే. రైతన్న ఆకాశం వైపు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నా అక్కడ మాత్రం నీలి మేఘాలపై కమ్ముకున్న కరువు చాయలు కనిపిస్తున్నాయి. అప్పుడప్పుడు కమ్ముకుంటున్న మేఘాలను చూస్తూ వర్షం వచ్చేస్తుందని సంబరపడుతూ, తీరా చినుకు రాలకపోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

అప్పులు చేసి సాగు చేశా...
మల్లారెడ్డి, రైతు బాసుపల్లి, దోమ మండలం



పంటల సాగుకు వేలాది రూపాయల అప్పులు చేసి సాగు చేశా. వర్షాకాలం ఉసూరుమనిపించడంతో వేసిన పంటలు ఎండుముఖం పట్టాయి. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియని పరిస్థితి నెలకొంది. గత ఏడాది కరువు దెబ్బను ఇప్పటికి కోలుకోలేదు. పొలాల్లో పంటలను చూస్తే మనసు చలిస్తున్నది.

‘ఆజీవక గ్రామీణ ఎక్స్‌ప్రెస్ యోజన’ ముఖ్య ఉద్దేశం?

1. 2020, 2024, 2028 ఒలింపిక్స్‌ల్లో భారత ప్రమాణాల మెరుగుదలకు కావాల్సిన సూచనల నివేదికను కేంద్ర క్రీడల శాఖకు సమర్పించిన ఎనిమిది మంది సభ్యుల కమిటీలో లేనివారు?
ఎ) పుల్లెల గోపిచంద్ బి) వీరేన్ రస్కిన్హా
సి) మిల్కాసింగ్ డి) అభినవ్ బింద్రా
2. భారత సుప్రీంకోర్టు తదుపరి, 45వ ప్రధాన న్యాయమూర్తిగా ఎవరు ఎంపికయ్యారు?
ఎ) జస్టిస్ ఎన్.వి.రమణ బి) జస్టిస్ దీపక్ మిశ్రా
సి) జస్టిస్ రంజన్ గగోయ్
డి) జస్టిస్ సంజన్ కిషన్ కాలే
3. కెన్యా అధ్యక్షుడిగా ఇటీవల తిరిగి ఎవరు ఎన్నికయ్యారు?
ఎ) ఊహూరు కెన్యాట్ట బి) డేనియల్ అరప్ మాయి
సి) జోమ్ కెన్యాట్ట డి) మవాయి కిబాకి
4. 2017 ఆగస్టు 11న ముప్పవరపు వెంకయ్య నాయుడు భారతదేశానికి ఎన్నో ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేశారు?
ఎ) 15 బి) 14 సి) 16 డి) 13
5. కేంద్ర సెన్సార్ బోర్డు నూతన చైర్మన్?
ఎ) ప్రసూన్ జోషి బి) విద్యాబాలన్
సి) పహలాజ్ నిహాలని డి) అదూర్ గోపాలకృష్ణన్
6. 2017లో లండన్ వేదికగా జరిగిన ‘ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్’ జావెలిన్ త్రో విభాగంలో ఫైనల్‌కి చేరిన తొలి భారతీయుడు?
ఎ) నీరజ్ చోప్రా బి) దవిందర్‌సింగ్ ఖాంగ్
సి) వికాస్‌గౌడ్ డి) అనిల్‌కుమార్
7. ప్రపంచ జీవ ఇంధన దినోత్సవం?
ఎ) ఆగస్టు 12 బి) ఆగస్టు 10
సి) ఆగస్టు 15 డి) ఆగస్టు 9
8. పర్యావరణ హానికరమైన 50 మైక్రాన్లలోపు ప్లాస్టిక్ బ్యాగ్‌లను ‘నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్’ ఇటీవల ఏ ప్రాంతంలో నిషేధించింది?
ఎ) చెన్నై బి) బెంగళూరు సి) కోల్‌కతా డి) ఢిల్లీ
9. పేదలకు అతి తక్కువ ధరకు మందులను విక్రయించే ‘ప్రధానమంత్రి భారతీయ జనౌషధి పరియోజన(పిఎంబిజెపై)’ కేంద్రాలను 1000కి పైగా ఏర్పాటు చేయడానికి కేంద్రంతో ఇటీవల ఒప్పందం కుదుర్చుకొన్న రాష్ట్రం?
ఎ) బీహార్ బి) ఉత్తరాఖండ్
సి) ఉత్తరప్రదేశ్ డి) హర్యాన
10. 2017 నవంబరు 28న జరిగే ‘ప్రపంచ భాగస్వామ్య సదస్సు’కు ఆతిథ్యమిస్తున్న నగరం?
ఎ) అహ్మదాబాద్ బి) కాన్పూర్
సి) మద్రాస్ డి) హైదరాబాద్
11. మసూమా ఎబ్టేకర్, మౌలావర్ధి అనే మహిళలు ఏ దేశానికి ఉపాధ్యక్షులుగా ఇటీవల నియమితులయ్యారు?
ఎ) ఇరాన్ బి) పాకిస్థాన్ సి) ఇరాక్ డి) జోర్డాన్
12. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నూతన చైర్మన్?
ఎ) షహర్యార్‌ఖాన్ బి) నజమ్ సేథి
సి) జహీర్ అబ్బాస్ డి) జావెద్ మియందాద్
13. కేంద్ర స్వయం సహాయక సంఘాల కార్యక్రమాల డిజిటలైజేషన్ కోసం ‘ఈ-శక్తి’ అనే కార్యక్రమం నిర్వహిస్తున్న సంస్థ?
ఎ) స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
బి) ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సి) రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా
డి) నేషనల్ బ్యాంక్ ఫర్ రూరల్ అండ్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్
14. 'BIMSTEC' కి సంబంధించి సరైనది?
ఎ) బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనమిక్ కోఆపరేషన్
బి) 1997 జూన్ 6న ప్రారంభం
సి) సభ్యదేశాలు - బంగ్లాదేశ్, ఇండియా, మయన్మార్, థాయ్‌లాండ్, భూటాన్, నేపాల్, శ్రీలంక డి) పైవన్నీ
15. 2017 ఆగస్టు 8న 'BIMSTEC' దేశాలు తమ తొలి విపత్తు నిర్వహణ విన్యాసాలను ఏ నగరంలో ప్రారంభించాయి?
ఎ) థింపు(భూటాన్)
బి) జయవర్ధనపుర కొట్టె(శ్రీలంక)
సి) న్యేపిడా(మయన్మార్)
డి) న్యూఢిల్లీ(ఇండియా)


ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

16. అయోధ్య వివాదానికి సంబంధించి అన్ని కేసుల పరిశీలనకు సుప్రీం కోర్టు ఇటీవల నియమించిన ముగ్గురు జడ్జీల కమిటీకి నేతృత్వం వహిస్తున్నది?
ఎ) జస్టిస్ జాస్తి చలమేశ్వర్
బి) జస్టిస్ దీపక్ మిశ్రా
సి) జస్టిస్ కురియన్ జోసఫ్
డి) జస్టిస్ రోహింటన్ ఫాలి నారిమన్
17. 2017కి గాను UEFA సూపర్ కప్ ఫుట్‌బాల్ టోర్నీ విజేత?
ఎ) రియల్ మాడ్రిడ్ క్లబ్
బి) యునైటెడ్ మాంచెస్టర్స్ క్లబ్
సి) బార్సిలోన క్లబ్ డి) మిలాన్ క్లబ్
18. 2017 ఆగస్టులో కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ‘ప్రపంచ ఏనుగుల దినోత్సవం’ సందర్భంగా ‘గజయాత్ర’ ప్రచార కార్యక్రమం ప్రారంభించింది. ‘ఏనుగుల దినోత్సవం’ ఎప్పుడు?
ఎ) ఆగస్టు 16 బి) ఆగస్టు 9
సి) ఆగస్టు 8 డి) ఆగస్టు 12

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్



19. అంగారక గ్రహంపై మేఘాల దృశ్యాలను చిత్రీకరించిన ‘క్యూరియాసిటీ’ రోవర్ ఏ దేశానికి చెందింది?
ఎ) జపాన్ బి) రష్యా సి) ఇండియా డి) అమెరికా
20. 2017 అక్టోబరు 19 నుంచి 29 వరకు రష్యా, భారత్ సంయుక్తంగా నిర్వహించనున్న సైనిక విన్యాసాలు?
ఎ) వరుణ బి) గరుడ సి) ఇంద్ర డి) మిత్రశక్తి
21. పదవికి రాజీనామా చేసిన గురుదీప్‌సింగ్ సప్పాల్ స్థానంలో నియమితులైన రాజ్యసభ టి.వి. నూతన సిఇఒ?
ఎ) సూర్యప్రకాశ్ బి) వెంపటి శశిశేఖర్
సి) శోభాసేన్ డి) మృదులాసిన్హా
22. 2017 ఆగస్టు 9, 10 తేదీల్లో ‘ఇండియన్ టెక్నాలజీ కాంగ్రెస్’ను నిర్వహించిన నగరం?
ఎ) బెంగళూరు బి) హైదరాబాద్
సి) అలహాబాద్ డి) కోల్‌కతా
23. ‘భారత్-ఆసియాన్ దేశాల యువసదస్సు’కి ఆతిథ్యం ఇచ్చిన నగరం?
ఎ) భోపాల్(మధ్యప్రదేశ్)
బి) మాండలే(మయన్మార్)
సి) కంపాంగ్ చామ్(కంబోడియ)
డి) సిసిలి(ఇండోనేషియా)
24. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఇటీవల రూపొందించిన మూకీ(సంజ్ఞలు) భాషలో ‘జనగణమన’కు దర్శకత్వం వహించింది?
ఎ) మధుర్ బండార్కర్ బి) అభిషేక్ చాబే
సి) గోవింద్ నిహలాని డి) అలంక్రిత్ శ్రీవాస్తవ్
25. 2017 ఆగస్టులో భారత కోస్ట్‌గార్డ్ దళం ప్రవేశపెట్టిన తీరగస్తీ నౌక?
ఎ) ఐఎన్ఎస్ మిత్ర బి) ఐఎన్ఎస్ మౌర్య
సి) ఐఎన్ఎస్ శౌర్య డి) ఐఎన్ఎస్ సుచిత్ర
26. 2017కి గాను ‘ద హ్యూగో అవార్డు’ పొందిన నవల ‘ద ఒబిలిస్క్ గేట్’ రచయిత?
ఎ) ఎన్.పి.ఉల్లేఖ్ బి) నోరా.కె.జెమిసిన్
సి) జేవియర్ మోరో డి) అనురాధ రాయ్
27. 2017 నవంబరులో జరగాల్సిన అండర్ 19 క్రికెట్ ఆసియా కప్ ఆతిథ్య వేదికను బెంగళూరు నుంచి ఎక్కడికి మార్చారు?
ఎ) శ్రీలంక బి) మలేషియా
సి) బంగ్లాదేశ్ డి) పాకిస్థాన్
28. కుష్ఠు వ్యాధి నివారణ కోసం పోరాడి ఇటీవల మరణించిన ‘రూత్‌పౌ’ని ఏ దేశంలో మరో ‘మదర్ థెరిసా’గా వ్యవహరిస్తున్నారు?
ఎ) పాకిస్థాన్ బి) కజకిస్థాన్
సి) శ్రీలంక డి) నేపాల్
29. కజకిస్థాన్ రాజధాని ఆస్తానా వేదికగా ముగిసిన ఆసియా చాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించిన మహేశ్వరి చౌహాన్ ఏ క్రీడకు చెందిన వ్యక్తి?
ఎ) ఆర్చరీ బి) బాక్సింగ్ సి) టెన్నిస్ డి) షూటింగ్
30. ‘దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన’లో భాగంగా కేంద్రం ప్రారంభించిన ‘ఆజీవక గ్రామీణ ఎక్స్‌ప్రెస్ యోజన’ ముఖ్య ఉద్దేశం?
ఎ) అసహాయ వర్గాలకు పెన్షన్ అందించడం
బి) వ్యవసాయ రంగంలో ఉచిత ట్రాక్టర్లు అందించడం
సి) గ్రామీణ ప్రాంతాల్లో రవాణా స్వయం సహాయక సంఘాలు నిర్వహించడం
డి) బ్యాంకింగ్ రంగంలో గ్రామీణ పరపతిని పెంచడం
